RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 123 | శుక్రవారం, జూన్ 14, 2024 | పేజీలు : 4

## ఏసీబీ వలలో అవినీతి ఇన్‌స్పెక్టర్..

హైదరాబాద్: సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. రూ.3లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. వివాదంలో ఉన్న ఇంటి పత్రాలు ఇవ్వడానికి బాధితుడి నుంచి సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రూ.15 లక్షలు డిమాండ్ చేశాడు.
దీంతో బాధితుడు మొదటి విడతలో రూ.5 లక్షలు చెల్లించాడు. రెండో విడతలో భాగంగా గురువారం రూ.3 వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్న బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హెడ్‌గా పట్టుకున్నారు.

# ఇటలీకి ప్రధాని మోడీ



న్యూఢిల్లీ: ప్రధానమంత్రిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన అనంతరం నరేంద్ర మోడీ తొలి విదేశీ పర్యటనకు వెళుతున్నారు. ఆయన ఈ రోజు సాయంత్రం ఇటలీ పర్యటనకు బయల్దేరారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఆహ్వానం మేరకు ఆయన ఇటలీలో పర్యటించనున్నారు. ఇటలీలోని ఏపూలియాలో జరిగే 50వ జీ7 అవుట్ రీచ్ సదస్సుకు ప్రధాని మోడీ హాజరుకానున్నారు. ఈ సదస్సు రేపు (జూన్ 14) జరగనుంది. ఈ సదస్సు సందర్భంగా, ప్రధాని మోడీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ మధ్య ద్వైపాక్షిక సమావేశం జరగనుంది. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పరస్పర సంబంధాల బలోపేతం, తదితర రంగాలకు చెందిన అంశాలపై మోడీ, మెలోనీ చర్చించనున్నారు. విదేశాంగ కార్యదర్శి వినయ్ క్వాత్రా మాట్లాడు తూ, ఇది జీ7 అవుట్ రీచ్ దేశాలు తమ అభిప్రాయాలను, దృక్పథాన్ని పంచుకునే బ్లాక్ ఎజెండా ఐటెమ్ అన్నారు. జూన్ 13 నుండి 15 వరకు ఇటలీలోని అపులియా ప్రాంతంలోని బోర్గో ఎగ్నాజియా విలాసవంతమైన రిసార్ట్‌లో జరగనున్న జీ7 నాయకుల శిఖరాగ్ర సమావేశంలో రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-హమాస్ వివాదం ప్రధానాంశం కానున్నది.

# ఏపీ సచివాలయంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు



అమరావతి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు నాయుడు సచివాలయంలో గురువారం సాయంత్రం 4.41 గంటలకు బాధ్యతలు చేపట్టారు. సెక్రటేరియట్‌లోని మొదటి బ్లాక్ ఛాంబర్‌లో కుల దైవమైన వేంకటేశ్వరస్వామికి పూజలు చేశారు. అనంతరం బాధ్యతలు చేపట్టారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, మంత్రులు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, కొల్లు రవీంద్ర, బోండ ఉమ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ పై తొలి సంతకం చేశారు. ల్యాండ్ అండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై రెండో సంతకం, పెన్షన్లు రూ. 4 వేలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయంపై మూడో సంతకం, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ పై నాలుగో సంతకం, స్కిల్ సెన్సెస్‌పై ఐదో సంతకం చేశారు. గురువారం తిరుమలలో వేంకట్వేరస్వామని, విజయవాడలో ఇంద్రకీలాద్రి దుర్గదేవిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం అమరావతి మీదుగా సెక్రటేరియట్‌కు బయలు దేరిన చంద్రబాబుకు అమరావతి రాజధాని రైతులు అడుగడుగునా పూలు చల్లుతూ స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించి అభిమానాన్ని చాటుకున్నారు. సెక్రటేరియట్‌కు చేరుకున్న చంద్రబాబుకు ఏపీ చీఫ్ సెక్రటరి నీరబ్ కుమార్ స్వాగతం పలికారు.

## బొగ్గు ఉత్పత్తి పెంచాలి: కిషన్ రెడ్డి



ఢిల్లీ: దేశంలో విద్యుత్ లేకుండా ఏ పనీ కాదని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. మోడీ హయాంలో కోతలు లేకుండా విద్యుత్ అందిస్తున్నామన్నారు. ఢిల్లీ శాస్త్రి భవన్‌లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రిగా మంత్రిగా కిషన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. అధికంగా బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందని, విద్యుత్ కోతలు లేకుండా ఉండాలంటే బొగ్గు ఉత్పత్తి పెంచాలన్నారు. మనం ఇతర దేశాల నుంచి బొగ్గు దిగుమతి చేసుకుంటున్నామని, రానున్న రోజుల్లో దిగుమతి తగ్గించి దేశీయంగా ఉత్పత్తి పెంచుదామని, ఖనిజాల అన్వేషణ, తవ్వకాల ద్వారా ఉపాధి కల్పనకు కృషి చేస్తామన్నారు.

## త్వరలోనే జిల్లాలవారీగా అందరినీ కలుస్తా : పవన్ కల్యాణ్



అమరావతి: రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత అన్ని వైపుల నుంచి అభినందనలు, శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయని... అందరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని పవన్ కళ్యాణ్ అన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు నన్ను నేరుగా కలిసి అభినందించాలని కోరుకుంటున్నారని, త్వరలోనే జిల్లాల వారీగా అందరినీ కలిసి మాట్లాడతానని పవన్ కల్యాణ్ అన్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను జనసేన ప్రధాన కార్యాలయం నుంచి విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 20 తర్వాత పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించాలని నిర్ణయించుకున్నట్లు పవన్ తెలిపారు. పిఠాపురం ప్రజలు నన్ను అఖండ మెజారిటీతో గెలిపించారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించి అసెంబ్లీ సమావేశాలు ముగించుకుని పిఠాపురం నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలతో కలుస్తాను.. ఆ తర్వాత దశలవారీగా అన్ని గ్రామాల్లో పర్యటిస్తాను... అని పవన్ తెలిపారు.

## 22న జిఎస్ టి కౌన్సిల్ సమావేశం



న్యూఢిల్లీ: వస్తువులు, సేవల పన్ను(జిఎస్ టి) మండలి జూన్ 22 న సమావేశం కావాలని నిర్ణయించింది. ఈ సమావేశం ఈ ఏడాది తొలి సమావేశం కానున్నది. ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం తెలిపారు. ఈ 53వ జిఎస్ టి కౌన్సిల్ సమావేశం జూన్ 22న న్యూఢిల్లీలో జరుగనుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. జిఎస్ టి కౌన్సిల్ సాధారణంగా ప్రతి మూడు నెలలకోసారి సమావేశం కావల్సి ఉంటుంది. కానీ 2022 నుంచి ఇప్పటి వరకు కేవలం ఆరు సార్లే సమావేశం అయింది. జరుగనున్న జిఎస్ టి కౌన్సిల్ సమావేశం ఏజెండా ఏమిటన్నది తెలియలేదు. అయితే రాష్ట్ర ఆర్థిక మంత్రులు కొన్ని పరోక్ష పన్నులను కేంద్ర బడ్జెట్ లో చేర్చాలని కోరవచ్చని అనుకుంటున్నారు.

## కొడంగల్‌లో బీసీ గురుకుల సంస్థ నిర్మాణానికి రూ.75 కోట్లు మంజూరు



హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో గురుకుల విద్యాసంస్థల నిర్మాణాలకు ప్రభుత్వం రూ. 75 కోట్లు కేటాయించింది. ఈ మేరకు బీజీ సంక్షేమశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. బీసీ గురుకుల జూనియర్ కళాశాలకు రూ. 25 కోట్లు, బీసీ గురుకుల పాఠశాలలకు రూ. 50 కోట్లు మంజూరు చేశారు.

## మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన బండి సంజయ్, కిషన్ రెడ్డి



న్యూ ఢిల్లీ: ఢిల్లీలోని హోంశాఖ కార్యాలయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ బాధ్యతలు స్వీకరించారు. మరోవైపు కిషన్ రెడ్డి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తల కష్టం వల్లే తెలంగాణలో బిజెపి గ్రాఫ్ క్రమంగా పెరుగుతోందన్నారు.
తమ ఓటింగ్ శాతం అసెంబ్లీ ఎన్నికల నుంచి లోక్ సభ ఎన్నికల నాటికి 14 శాతం నుంచి 36 శాతానికి పెరిగిందన్నారు. తెలంగాణలో బిఆర్ఎస్ కనుమరుగయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేసిన ఓటర్లు కూడా లోక్ సభ ఎన్నికల్లో మాత్రం బిజెపికి వేశారని తెలిపారు.

## 'ఎన్ఎస్ఏ' చీఫ్‌గా అజిత్ దోవల్ మళ్లీ బాధ్యతలు

### - ప్రధాని మోడీకి ప్రధాన కార్యదర్శిగా పికె మిశ్రా



న్యూఢిల్లీ: జాతీయ భద్రతా సలహాదారుగా అజిత్ దోవల్‌ను, ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీగా పీకే మిశ్రాను జూన్ 10 నుంచి మళ్లీ నియమించినట్లు ప్రభుత్వం గురువారం ఇక్కడ తెలిపింది. నియామకాలను ప్రకటించే ప్రకటనలలో, ప్రభుత్వం "ప్రధానమంత్రి పదవీకాలంతో పాటు లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు, ఏది ముందుగా ఉంటే అది సహ-టెర్మినస్" అని పేర్కొంది. అంటే నరేంద్ర మోదీ ప్రధాని అయ్యే వరకు, లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు అధికారులు తమ పదవుల్లో ఉంటారని అర్థం. మిస్టర్ దోవల్ మరియు మిశ్రా ఇద్దరూ తమ పదవీ కాలంలో ప్రాధాన్యత పట్టికలో క్యాబినెట్ మంత్రి హోదాను కేటాయిస్తారు, ప్రకటనలు తెలిపాయి. జూన్ 10 నుండి అమలులోకి వచ్చే రెండేళ్లపాటు ప్రధాని కార్యాలయంలో అమిత్ ఖరే మరియు తరుణ్ కపూర్‌లను ప్రధానమంత్రి సలహాదారులుగా పునఃనియమించడాన్ని కూడా క్యాబినెట్ నియామకాల కమిటీ ఆమోదించింది. వారు "ర్యాంక్ మరియు స్కేల్ సెక్రటరీ హోదాలో నియమితులయ్యారు. భారత ప్రభుత్వానికి". ఈ నియామకాలు ఈ అధికారులపై ప్రధానమంత్రికి ఉన్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తాయి, ముఖ్యంగా మిస్టర్ దోవల్ మరియు మిశ్రా చాలా సంవత్సరాలుగా వారి చాలా ముఖ్యమైన పదవులలో ఉన్నారు. మిస్టర్ దోవల్, ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ డైరెక్టర్, ప్రధానమంత్రికి అత్యంత విశ్వసనీయ సహాయకులలో ఒకరు మరియు 2014 నుండి జాతీయ భద్రతా సలహాదారుగా ఉన్నారు. కేరళ కేడర్‌కు చెందిన 1968-బ్యాచ్ IPS అధికారి, మొదటి పోలీసు. కీర్తి చక్రతో అలంకరించబడింది, ఇది అశోక్ చక్ర తర్వాత రెండవ అత్యున్నత శాంతికాల శౌర్య పురస్కారం. అన్ని ఉగ్రవాద వ్యతిరేక మరియు గూఢచార సంస్థలను కలిగి ఉన్న జాతీయ భద్రతా స్థాపనకు బాధ్యత వహించే వ్యక్తిగా, అతను దేశంలోని అత్యంత శక్తివంతమైన అధికారులలో ఒకడు.

## నీట్-యూజీ పరీక్ష పేపర్ లీకేజీపై ఆధారాలు లేవు: మంత్రి ధర్మేంద్ర ప్రదాన్

న్యూఢిల్లీ: నీట్-యూజీ మెడికల్ ఎంట్రెన్స్ పరీక్ష పేపర్ లీకైనట్లు వస్తున్న ఆరోపణలను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ కొట్టిపారేశారు. పేపర్ లీకేజీకి సంబంధించిన ఆధారాలు లేవని ఆయన వెల్లడించారు. నీట్-యూజీ పేపర్ లీక్‌పై ఆధారాలు లేవని, ఎన్టీఏలో అవినీతి జరిగిందన్న ఆరోపణలు నిజం కాదు అని, అది చాలా నమ్మకమైన సంస్థ అని మంత్రి ప్రదాన్ తెలిపారు. ఈ కేసులో సుప్రీంకోర్టు వాదనలు వింటోందని, కోర్టు ఇచ్చే తీర్పుకు కట్టుబడి ఉంటామని ఆయన పేర్కొన్నారు. ఏ ఒక్క విద్యార్థికి కూడా నష్టం జరగకుండా చూస్తామన్నారు. ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ల కోసం నీట్-యూజీ రాసిన 1563 విద్యార్థులకు గ్రేస్ మార్కులు ఇవ్వడాన్ని రద్దు చేస్తున్నట్లు సుప్రీంకోర్టుకు ఇవాళ కేంద్రం వెల్లడించింది. అయితే ఆ విద్యార్థులు జూన్ 23వ తేదీన మరోసారి పరీక్ష రాసేందుకు అనుమతి ఇవ్వనున్నట్లు కేంద్రం చెప్పింది. ఒకవేళ విద్యార్థులు పరీక్షను రాయడానికి విముఖంగా ఉంటే, అప్పుడు ముందు వచ్చిన మార్కులనే పరిగణలోకి తీసుకోనున్నట్లు కేంద్రం తెలిపింది.

## సంపాదకీయం

# సర్కారు బడులకు ఎందుకీ పరిస్థితి?

నేను, మా బడికి వచ్చే సార్లను, మేడంలను ఏమైంది టీచర్ మన బడికి ఎక్కువ మంది పిల్లలు అత్తలేరు అని అడిగినా.. అంటే టీచర్, మన దగ్గరే అన్ని సౌలతులు ఉన్నయి కానీ ఈ జనాలకు అర్థం అయితలే, అందరూ ప్రైవేటు బడులెంట ఉరుకుతున్నరు, గట్ల ఉరికి ఉరికి ఆగమై, పైసలు పోగొట్టుకుంట్రు అన్నది. ఎందుకు టీచర్ మన ప్రభుత్వ బడులకు గీ పరిస్థితి అని అడిగితే.. ప్రతి సంవత్సరం పిల్లలు అత్తరేరని మేమే, బడిబాట పేరుతో.. మా బడికి మీ పిల్లల్ని ఎందుకు పంపుతలేరని పోరగాండ్ల అయ్యా, అవ్వలను అడిగితే ప్రైవేట్ బల్లే పట్టించుకున్నట్టు మీ సర్కారు బల్లే పిల్లని పట్టించుకోరు, మీ బడికి పోరగండ్లను పంపితే ఆగం అయితరు అంట్రు. అయినా సర్కార్ బల్లే ఇంగ్లీష్ మీడియం లేక పంప బుద్ధి అయితలే అనబట్టిరి. అరే గిదేం కిరికిరి మా బల్లె పట్టించుకున్నట్టు ఎక్కడన్నా పట్టించుకుంటరా మా సార్లు, మేడంలు బాగా చదువుకున్నోళ్లు, మంచిగా పాఠాలు చెప్తరు. మా బల్లె ఆటలు పాటలు అన్ని ఉంటయి, ఇగ ఇంగ్లీష్ మీడియం ఎలాగూ ఉండనే ఉండే. పోరగాండ్లందరికి ఫ్రీగా బుక్స్ ఇత్తం, యూనిఫాం కూడా ఇయ్యవడితిమి, పగటి పూట మంచిగా బువ్వ పెడతాం. ఇంకేం కావాలి. అందరినీ మా బడికి పంపుమని చెప్పినా, చూడాలి మరి ఈసారన్నా పంపిస్తారో లేక ప్రైవేటుకే పంపుతరో. మా పెద్ద సార్‌తో ఈసారి ఎట్లనన్న చేసి మన బడికి ఫుల్‌గా పిల్లలు అచ్చేటట్లు చేయాలె సర్ అంటే, ఏం జేసుడో ఏమో.. బల్లె ఊడ్చుటోళ్లు, గంట కొట్టేటోళ్లు లేరు. అన్ని సబ్జెక్టులకు సార్లు లేరు. ఎల్ల తెల్లదీసుడే ఉంది. ఇదివరకటి గవర్నమెంట్ కరెంట్ బిల్లు కట్టడానికి, చాక్పీస్ దస్టర్లలకు కూడా సరిగా పైసలు ఇయ్యకపాయే, జేబులకెళ్లి పెట్టుకుంటి ఎట్ల జేశుడో ఏమో అనబట్టే. ఇప్పుడున్న సర్కారోళ్లు జర మా పెద్ద సారుకు టెన్షన్ లేకుండా బడి మంచిగా నడిపేటట్లు చెయిర్రి. ఏ మాట కామాట చెప్పుకోవాలి. ఎనుకటి కంటే ఇప్పుడు సర్కారు బల్లల్లో సౌలతులు మంచిగా అయినయి. లైబ్రరీ, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు అన్ని పెట్టిర్రు. జనాలు కూడా జర సోచయించాలే గివన్ని ప్రైవేటులో ఉంటాయా? జర మీరే చెప్పుండ్రి. పుక్కిడి వస్తె జనాలకు నచ్చుడం లేదోమో మరి. మంచిగా మా బడికి పంపక ఇదేందో ఏమో. మేడంలు సార్లతో మాట్లాడితే ఈ నౌకరీ జేయబట్టి ఇరువై ఏండ్లు అయితుంది ఓ ప్రమోషన్ లేదు ఏం లేదు, అయినా ఇదే బల్లె 10 ఏండ్లుగా పనిచేస్తున్న ట్రాన్స్ఫర్ కూడా లేదు. ఏం నౌకరో ఏమో అనిరి. ఇప్పటికన్నా ఇంకా మంచిగా మావోల్లు పనిచేస్తరు, మంచి రిజల్ట్స్ తెస్తరు, అందులో డౌట్ ఏ లేదు. ఈ సారి కూడా మన బడిలో టెన్త్ క్లాస్ ఓల్లు అందరూ పాస్ అయింద్రు. 10 జీపీఏ లు కూడా వచ్చినయి, బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు వస్తయని పోరగాండ్లు ఫుల్ ఖుషీగా ఉన్నరు. అంతట్లకే మా ఎంఈఓ సర్ వచ్చే, 'ఈ బడి బాటేందో నా సావుకి వచ్చింది. ఒక్కొన్ని ఎనిమిది మండలాలు తిరుగాలే, ఏం తిరుగుడో ఏమో ఎప్పుడు ఎక్కడ ఉంటానో ఏం చేస్తానో నాకే తెలుస్తలేదు, ఏ బడిలో ఏ ఉందో ఏం లేదో కూడా నాకు తెలుస్తలేదు. అటు నా బడి సూస్కోవాలి ఇటు ఎనిమిది మండలాలకు నేనే ఇన్చార్జినీ ఎట్ల జెసుడో ఏమో ఈ టెన్షన్‌కె నాకు బీపీ, షుగర్ వచ్చినయి అయినా కూడా గోళీలు మింగుకుంటూ తిరుగుతున్న' అనబట్టే. ఇవన్నీ విన్నంక నాకు అర్థమైంది మా స్కూల్‌కి పిల్లలెందుకు అత్త లేరో. ఇదివరకటి సర్కారు పట్టించుకోలే ఇప్పుడున్న సర్కారైన పట్టించుకోని బడులు మంచిగా నడుపడానికి పైసలు, ఊడ్చేటోల్లను, గంటకొట్టెటోల్లను ఇచ్చి, సరిపోయేంత టీచర్లు ఉండేటట్లు చేయాలి. మా సార్లకు మేడంలకు జర ప్రమోషన్ల ట్రాన్స్ఫర్ జేయుర్రి. పాపంగా ఎంఈఓ సార్లు ఎన్నని తిరుగుతరు, ఎక్కడోల్లకు అక్కడ ఇయ్యలే స్కూల్‌లను, సార్లను సూసుకోవడం. అందరం మనిషికో చేయి వేస్తే ఏదైనా చేయొచ్చు. అందరం గట్టిగా అనుకుంటే గవర్నమెంట్ బడులు మంచిగా నడుస్తయి. సర్కారీ బడి మంచిగా నడిస్తేనే బీద బిక్కి అందరూ బాగా సదువుకుంటరు.

# జగన్ పై ఇక నో కామెంట్స్...

**విజయవాడ:** మాజీ ఎంపీ టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి తాను జగన్ గురించి వ్యక్తిగతంగా మాట్లాడబోనని ప్రకటించారు. భీమవరంలో మీడియా సమావేశంలో ఆయనీ వ్యాఖ్యలు చేశారు. వైసీపీ రెబల్ ఎంపీగా మారినప్పటి నుండి రఘురామకృష్ణరాజు ప్రతీ రోజూ రచ్చబండ పేరుతో ప్రెస్ మీట్ పెట్టి జగన్ పై విమర్శలు గుప్పించేవారు. ఇప్పుడు హఠాత్తుగా ఇకపై జగన్ గురించి మాట్లాడబోనని ఆయన ప్రకటించడం ఆశ్చర్యకరంగా మారింది. అయితే దీనికి ఆయన తన వివరణ ఇచ్చారు. జగన్ మా మంచో చెడో చేయాల్సింది చేశాడు వెళ్లిపోయాడని ఇప్పుడు ప్రజలు ఆ విషయం పట్టించుకోరన్నారు. ప్రజల దృష్టి ఇప్పుడు టీడీపీ పాలనపై ఉంటుందన్నారు. హామీలను నెరవేర్చాలని ప్రజలు కోరుకుంటారని అందుకే మేం కూడా మా హామీలను అమలు చేసే విషయంపైనే దృష్టి కేంద్రీకరిస్తామన్నారు. జగన్ పై కానీ, వైసీపీ పైన కానీ ప్రజల దృష్టి ఉండదన్నారు. తాను మళ్లీ విమర్శలు చేస్తే ప్రజల దృష్టి అటు మళ్లుతుందని.. అలా ఉండకూడదు రఘురామ స్పష్టం చేశారు. ప్రజలు మనకు అధికారం ఇవ్వలేదు, బాధ్యతను కట్టబెట్టారని చంద్రబాబు చెప్పారని రఘురామ గుర్తు చేసుకున్నారు. టీడీపీ నేతలు దాడులు చేయవద్దని.. తప్పు చేసిన వాళ్లను చట్టప్రకారం శిక్షించాలన్నారని చంద్రబాబు చెప్పారని రఘురామ అన్నారు. అందుకే తనపై జరిగిన కస్టోడియల్ దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. ఆసుపత్రి నివేదిక ప్రకారం తనపై కస్టోడియల్ టార్చర్ జరిగిందని స్పష్టంగా తెలుస్తోందని చెప్పారు. అలాంటిది నాను నేనే న్యాయం చేసుకోకుంటే సామాన్యులకు న్యాయం జరుగుతుందనే నమ్మకం పోతుందని దీనిని దృష్టిలో ఉంచుకునే పోలీసులకు ఫిర్యాదు చేశానని గుర్తు చేశారు. ఒకటి రెండు రోజుల్లో ఎఫ్ఐఆర్ నమోదవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విషయంపై తాను ఎవరితోనూ మాట్లాడలేదని, ఎవరి సూచనల మేరకో తాను ఫిర్యాదు చేయలేదన్నారు. ఏపీలో హింస జరుగుతోందని వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలను కూడా రఘురామ కొట్టి పడేశారు. ఇద్దరు వ్యక్తులు కొట్టుకుంటే దెబ్బతిన్న వ్యక్తికి వైసీపీ ముసుగేసి చంపేస్తూన్నారని హడావిడి చేస్తున్నారని విమర్శించారు. పందాలు కాసిన వాళ్ళు కొంతమంది ఆత్మహత్య చేసుకుంటున్నారని.. దానిని వైసీపీ ప్రభుత్వం రాలేదని చనిపోయినట్టు చిత్రీకరిస్తున్నారని విమర్శించారు. ఈ ఆత్మహత్యలకు జగన్ రెడ్డి ఓదార్పు యాత్ర 2.0 స్టార్ట్ చేస్తారేమోనని అనుమానం వ్యక్తం చేశారు. టీడీపీ కూటమి విజయంలో క్షత్రియుల పాత్ర చాలా ఎక్కువగా ఉందన్నారు. క్షత్రియులకు ఎవరో ఒకరికి ఏదో ఒక పదవి ఇస్తారని అనుకుంటున్నానని రఘురామ నమ్మకం వ్యక్తం చేశారు.

==================================

# జీనం వ్యాలీని సందర్శించిన 2023 బ్యాచి ట్రైని కలెక్టర్లు




**శామీర్ పేట, (గరుడ వాత) :** శిక్షణలో ఉన్న 2023 బ్యాచ్ కలెక్టర్లు జీనోమ్ వ్యాలీని సందర్శించారు. గురువారం తెలంగాణ రాష్ట్రానికి కేటాయించబడిన 2023 బ్యాచ్ కు చెందిన ఏడు మంది ట్రైనీ ఐ.ఏ.ఎస్ లకు శిక్షణలో భాగంగా డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ జనరల్, ఐఏఎస్ డాక్టర్ శశాంక్ గోయల్ ఆదేశాల మేరకు శామీర్ పేట మండలం తుర్కపల్లి పరిధిలోని జీనోమ్ వ్యాలిని సందర్శించారు. అందులో బయోలాజికల్ ఈ లిమిటెడ్ సెజ్ యూనిట్ కు సంబంధించిన సైంటిస్టులు వివిధ రకాల వ్యాక్సిన్ల తయారీ విధానాన్ని ట్రైనీ కలెక్టర్లకు వివరించారు. ఇండియన్ మెడికల్ సైన్స్ ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యతతో కూడిన వ్యాక్సిన్లను అందజేస్తున్నందుకు సైంటిస్టులను ట్రైనీ ఐఏఎస్ లు అభినందించారు. అనంతరం మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టరేట్ ను సందర్శించగా వివిధ పాలన అంశాలకు సంబంధించిన సూచనలను ట్రైని కలెక్టర్లకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ వివరించారు. తదుపరి అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య ను మర్యాద పూర్వకంగా ట్రైని కలెక్టర్లు కలిశారు. ఈ కార్యక్రమంలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి నోడల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ డాక్టర్ వెంకట శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ వ్యక్తుల కబంధహస్తాల నుంచి ప్రభుత్వ భూమిని పరిరక్షించాలి

## - అట్టి భూమిని ఇల్లు లేని పేదలకు కేటాయించాలి

## - అలియాబాద్ ఎంపీటీసీ సగ్గు శ్రీనివాస్ యాదవ్



**శామీర్ పేట, (గరుడ వార్త) :** ప్రైవేట్ వ్యక్తుల కబంద హస్తాల నుంచి ప్రభుత్వ భూమిని పరిరక్షించి, అట్టి భూమిని ఇల్లు లేని పేదలకు కేటాయించాలంటూ తాహసిల్దార్‌కు ఎంపీటీసీ సగ్గు శ్రీనివాస్ యాదవ్ కోరారు. గురువారం శామీర్ పేట తాసిల్దార్ యాదగిరి రెడ్డిని కలిసి, అలియాబాద్ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని ఎంపిటిసి సగ్గు శ్రీనివాస్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిటిసి మాట్లాడుతూ... శామీర్ పేట పెద్ద చెరువు సమీపంలోని సర్వే నంబర్ 509/1 లోని 12 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేశారని, కబ్జాకోరాల నుంచి ఆ భూమిని పరిరక్షించాలని తహసిల్దార్ ను వినతి పత్రంలో కోరారు.

# పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానించిన ఉపాధ్యాయులు



**శామీర్ పేట, (గరుడ వార్త) :** పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పదో తరగతిలో మండల స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు గురువారం ఘనంగా సన్మానించారు. శామీర్ పేట మండలం అలియాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024 సంవత్సరంలో పదో తరగతి చదువుతున్న రజిత 9.7 జిపిఏతో మండలంలో మొదటి స్థానం సాధించగా, ఐశ్వర్య 9.4 జి పి ఏ, లోపం ముద్ర 9.0 జిపిఏ ఉత్తీర్ణత సాధించారు. తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ సన్మానించారు. అలాగే ప్రధానోపాధ్యాయుడు గోపాలను, ఉపాధ్యాయురాలు అమర జ్యోతిని పిఆర్టియు ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మహేష్ ,రాష్ట్ర బాధ్యులు శేఖర్ రెడ్డి, రాజేందర్, మైకల్ రెడ్డి, వెంకటయ్య, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధియే ధ్యేయం ముందుకు సాగుతాం



**శామీర్ పేట, (గరుడ వార్త) :** గ్రామాల అభివృద్ధియే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ఎంపీపీ ఎల్లుబాయి అన్నారు. గురువారం మండల కేంద్రం శామీర్ పేటలో ఎంపీపీ ఎల్లుబాయి సుమారు రూ. 8 లక్షల 30 వేల నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఎల్లుబాయి మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరారు. మండల కేంద్రం శామీర్ పేట్ గ్రామంలోని పలు వార్డుల్లో సిసి రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తదితర పనులకు శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ నుంచి రూ. 4 లక్షల 30 వేలు, గ్రామ పంచాయతీ నుంచి రూ. 4 లక్షలు మొత్తం రూ. 8 లక్షల 30 వేలతో పలు అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ప్రత్యేక అధికారి విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మౌనిక, ఎంపీటీసీ సాయిబాబా, శామీర్ పేట్ సహకార సంఘం వైస్ చైర్మన్ ఐలయ్య యాదవ్, డైరెక్టర్ భూమి రెడ్డి, నాయకులు ముజిబుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం: ఇద్దరు మృతి

**భూపాలపల్లి:** తెలంగాణ జిల్లాల్లో రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఓవర్టెక్, మద్యం తాగి నడపడం, అతి వేగం తదితర కారణాల వల్ల ప్రతిరోజు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాల వల్ల ఎందరో అమాయకులు బలవుతు న్నారు. కుటుంబాలు చిన్నభిన్నమవుతున్నాయి. తాజాగా. ఈరోజు భూపాల పల్లిజిల్లా దామరకుంట, విలాసాగర్,గ్రామాల మధ్య ఈరోజు మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసు కుంది, వివరాలు కి వెళ్తే. దామర కుంట,నుండి గంగారం వైపు బైకుపై వెళ్తన్న అట్ల బాపు, విలాసాగర్ గ్రామానికి చెందిన కాపర బోయిన రాజయ్య అవసరం నిమిత్తము విలాసాగర్ నుండి దామరకుంట వెళుతున్న క్రమంలో రెండు బైకులు ఎదురుగా ఢీకొన్నాయి. దీంతో ఇద్దరు కింద పడి పోగా, వారి వెనకాలే వస్తున్న ఇసుక ట్రాక్టర్ అదుపు తప్పి ఇద్దరు వ్యక్తుల పై నుండి వెళ్లిపోవడంతో అట్ల బాపు అక్కడే మృతిచెందగా, తీవ్ర గాయాలతో ఉన్న రాజయ్య ను కాటారం ప్రభుత్వ ఆసు పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో చనిపోయాడు. సంఘటన స్థలానికి చేరు కున్న కాటారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. సంఘటనకు సంబంధించిన మరికొన్ని వివరాలు తెలియవలసి ఉంది.

## ఆస్తి కోసం..
### మామగారిని అలా చంపి

**నాగ్ పూర్:** చక్కని సంసారం, కోట్ల ఆస్తి, ఒద్దికైన కుటుంబం.. ఇవన్నీ ఉన్నా ఆమెకు తృప్తికలగలేదు. ఏకంగా అత్తింటి ఆస్తినే కాజేచాలనే దుర్బుద్ధి ఆమెలో పుట్టింది. దీంతో సమాజంలో మంచి హోదా, గౌరవం ఉన్నా మామను హత్య చేస్తే.. రూ.300 కోట్ల ఆస్తికి తానొక్కతే రాణి అవుతుందని కలలు కంది. అంతే రూ. కోటి సుపారీ ఇచ్చి మామను కారుతో ఢీ కొట్టి చంపించింది. కాని విధి ఆమెను పట్టించింది. ఈ దారుణ ఘటన నాగపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..అర్చన మనీశ్ పుట్టేవార్ (53) ప్రభుత్వ టౌన్ ప్లానింగ్ విభాగంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తుంది. ఆమె భర్త మనీశ్ వృత్తిరిత్యా డాక్టర్. అయితే అర్చనకు మామ పురుషోత్తం పుట్టేవార్ (82) ఆస్తిపై కన్ను పడింది. అత్త శకుంతల అనారోగ్యంతో ఎలాగూ మంచం పట్టింది. మామను కూడా అడ్డు తొలిగించుకుంటే రూ.300 కోట్ల ఆస్తి మొత్తం తన సొంతం అవుతుందని అత్యాశకు పోయింది. వెంటనే మామ హత్యకు కుట్ర పథకం పన్ని తన భర్త వద్ద డ్రైవర్‌గా పని చేసే బగ్డే, అతడి స్నేహితులు నీరజ్ నిమ్జే, సచిన్ ధార్మిక్‌కు రూ. కోటి ఇచ్చి మామను అంతమొందించే పని అప్పగించింది.ఈ క్రమంలో 15 రోజుల క్రితం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భార్య శకుంతలను కలిసి పురుషోత్తం బయటకు వస్తుండగా.. బగ్డే, అతడి మిత్రులు కారుతో ఢీ కొట్టి వేగంగా పరారయ్యారు. ఈ ఘటనలో పురుషోత్తం అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. హత్య కేసు దర్యాప్తు ఇది ప్రమాదవశాత్తూ జరిగిన ఘటన కాదని పోలీసులు అనుమానించారు. నిశితంగా దర్యాప్తు జరపగా హత్యవెనుక కోడలు అర్చన హస్తం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో పోలీసులు ఆమెతో పాటు ముగ్గురు నిందితులను కూడా అరెస్టు చేశారు. అంతేకాకుండా నిందితురాలు అర్చన టౌన్‌ప్లానింగ్ శాఖలో అనేక అక్రమాలకు పాల్పడ్డట్లు పోలీసుల విచారణలో బయటపడింది. వీరిపై హత్య నేరంతో పాటు ఐపీసీ, మోటారు వాహనాల చట్టం కింద ఇతర సెక్షన్ల కింద అభియోగాలు మోపారు. రెండు కార్లు, బంగారు నగలు, మొబైల్ ఫోన్లు వీరి నుంచి స్వాధీనం చేసుకున్నారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయుడు దారుణ హత్య

**తిరుపతి:** న్నమయ్య జిల్లా మదనపల్లెలో గురువారం తెల్లవారుజామున ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు దారుణ హత్యకు గురయ్యాడు. పట్టణంలోని ఎగువకురవంకకు చెందిన టీచర్ దొరస్వామిని గుర్తు తెలియని దుండగులు దారుణంగా హతమార్చారు. ఆయన దిగువ కురవంకలోని ప్రాథమికోన్నత పాఠశాలలో దొరస్వామి ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. కురవంక పార్క్ వద్ద ఆంజనేయ గుడికి సమీపంలో ఇంట్లోని మిద్దెపై ఈ హత్య జరిగింది. మృతుని భార్య కొన్నేళ్ల క్రితం మృతి చెందగా.. ఆయన కుమార్తె హరితతో కలిసి ఉంటున్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆయన తలపై ఎవరో బలంగా కొట్టడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, సీఐ వలీబ్ బసు వివరాలు సేకరించారు. ఎవరో పథకం ప్రకారం దొరస్వామిని దారుణంగా హత్య చేసినట్లు.. మృతదేహం పడి ఉన్న తీరును బట్టి పోలీసులు భావిస్తున్నారు. హత్య జరిగిన సమయంలో ఆయన కుమార్తె ఇంట్లోనే ఉండడంతో ఆమెను విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కేసీఆర్ పై ఈడీ కేసు

**హైదరాబాద్:** మెదక్ పార్లమెంటరీ నియోజకవర్గానికి చెందిన బీజేపీ ఎంపీ ఎం. రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు కేసు నమోదు చేశారని అన్నారు. కాసేపటి క్రితమే ఆ కేసు నమోదైందని అన్నారు. అనంతరం కేసీఆర్ ను విచారణ చేసేందుకు ఈడీ అధికారులు కూడా వచ్చినట్లు చెప్పారు. గొర్రెల కొనుగోలు వ్యవహారంలో ఈడీ ఈ కేసు నమోదు చేసిందని వ్యాఖ్యలు చేశారు. మెదక్ పట్టణ కేంద్రంలో జరిగిన దిల్ సే ములాఖాత్ కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారుఅంతకు ముందు మెదక్ అసెంబ్లీ నియోజకవర్గం హవెలి ఘన్పూర్ మండలం ముత్తాయిపల్లి శివాలయంలో కూచానపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో రఘునందన్ రావు పూజలు చేశారు. తర్వాత మెదక్ పట్టణంలో పంచముఖి హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కు తీర్చుకున్నారు.

# స్వచ్ఛంద రక్తదానం
## యువత నినాదం కావాలి

రక్తాన్ని ఏ ప్రయోగశాలలో కూడా తయారు చేయగల శాస్త్రసాంకేతిక పద్దతులు ఇంకా రాలేదు. రక్తానికి మరో ప్రత్యామ్నాయం కనిపించడం లేదు. ప్రమాదాలలో తీవ్రంగా గాయపడిన వేళ, పలు తీవ్ర అనారోగ్య సమయాల్లో, ప్రసవ సమయాల్లో, సంక్లిష్ట శస్త్రచికిత్స చేసే క్షణాల్లో, ప్రాణాపాయంతో కొట్టుమిట్టాడే వ్యక్తులకు సురక్షిత రక్తం లేదా రక్త ఉత్పత్తులు అందించుట అత్యవసరంగా జరిగితేనే ప్రాణాలు నిలుస్తాయి. రక్తదాతలు మాత్రమే ఇలాంటి అమూల్య ప్రాణాలు నిలిపే దైవ సమాన సేవలను అందించగలరు. రక్తదాన యజ్ఞం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం, దాతలను సముచితంగా గుర్తించి ప్రోత్సహించడం, రక్తదానం పట్ల అపోహలను తొలగించడం కోసం “ఐరాస – రెడ్‌క్రాస్ సొసైటీ”లు సంయుక్తంగా ప్రతి ఏట 14 జూన్ రోజున ‘ప్రపంచ రక్తదాతల దినం (వరల్డ్ బ్లడ్ డోనార్ డే)’ పాటించుట జరుగుతుంది. 2005లో ప్రారంభమైన “ప్రపంచ రక్తదాతల దినం“ వేదికగా 192 దేశాలు పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రచారాలు ప్రారంభించాయి. సకాలంలో రక్తం అందక ప్రాణాలు కోల్పోయే అభాగ్యుల పట్ల సహానుభూతిని ప్రదర్శిస్తూ, ప్రతి ఏట కనీసం 2 – 3 సార్లు అయినా రక్తదానం చేసే అలవాటును ప్రతి ఒక్కరు, ముఖ్యంగా యువత చేసుకోవాలని విజ్ఞప్తి చేయడం జరుగుతున్నది. రక్తం ఏ, బి, ఏబి, ఓ అనబడే నాలుగు రకాలుగా ఉంటుందని కనుగొన్న ప్రఖ్యాత శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత ‘కార్ల్ లాండ్‌స్టేనర్’ జన్మదినం (14 జూన్ 1868) సందర్భంగా ఈ “ప్రపంచ రక్తదాతల దినం” నిర్వహించుట జరుగుతున్నది. ప్రభుత్వాలు, వైద్యరంగం, స్వచ్ఛంధ సంస్థలు రక్తదాన శిబిరాల ఏర్పాటు చేసేందుకు చొరవ చూపాలి. రక్తం నిలువ చేయడం, రక్త పరీక్షల నిర్వహణ, రక్తనిధి కేంద్రాల స్థాపన, రక్త సేకరణ, అందరికీ అందుబాటులో ఉంచడం లాంటి అంశాలకు అధిక ప్రాధాన్యతలు ఇవ్వాలి. రక్తదాతలు సేవా గుణంతో మిలియన్ల ప్రాణాలు నిలపడం, సరైన జీవనాన్ని గడిపేలా సహకరించడం జరుగుతున్నది. ప్రపంచ దేశాలన్నింటిలో రక్తదానం అత్యవసరం అయ్యింది. విశ్వమంతటా రక్త కొరత ఉంది. అధిక జనాభాగల అభివృద్ధి చెందుతున్న భారత్ లాంటి దేశాల్లో రక్త కొరత తీవ్రంగా ఉంది. ప్రపంచ రక్తదాతల దినం–2024 నినాదంగా ‘రెండు దశాబ్దాల దాన యజ్ఞం, నిస్వార్ధ రక్తదాతలకు కృతజ్ఞతలు’ అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది. స్వచ్ఛంధ రక్తదాతలకు కృతజ్ఞతలు తెలుపడం, కొత్త దాతలను ఆహ్వానించడం, డబ్బు కోసం రక్తదానం చేసే వారిని నిరోధించడం, రక్తదాన ప్రాముఖ్యతను వివరించడం, యువత రక్తదాతలుగా ప్రజారోగ్య పరిరక్షణలో మానవీయతను చాటడం లాంటి పలు ప్రచారాలను నిర్వహించాలి. రక్తంతో పాటు రక్త ఉత్పత్తులైన ప్లేట్లెట్లు, ప్లాస్మా, క్రయో, తెల్ల/ఎర్ర (ఎరిత్రోసైట్స్, ల్యూకోసైట్స్) రక్తకణాలు– గ్రాన్యులోసైట్స్ లాంటివి కూడా రోగులకు అత్యవసరంగా అందించడం జరుగుతుంది. భారతదేశంలో 5 కోట్ల యూనిట్ల రక్తం అవసరం ఉండగా 3 కోట్ల యూనిట్ల మాత్రమే రక్తదాతల ద్వారా లభిస్తున్నది. ప్రతి రోజు 38,000 రక్తదానాలు జరగాల్సి ఉంది. సంపూర్ణ ఆరోగ్యం, 50 కిలోలు మించి బరువు, 18 – 65 ఏండ్ల వయస్సు, డెసిలీటర్ రక్తంలో 12.5 గ్రామ్‌ల హిమోగ్లోబిన్ లాంటి అర్హతలు కలిగిన ప్రతి ఒక్కరు ప్రతి 3 మాసాలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు. హెచ్ఐవి, గుండె జబ్బులు, హెపటైటిస్ బి, రాబిస్, గర్భిణులు, నిత్యం ఆల్కహాల్ సేవించే వారు, రొమ్ముపాలు ఇచ్చే తల్లులు, తీవ్ర అనారోగ్యం నుంచి కోలుకున్నవారు, ఫిట్స్, టిబి, ఎలర్జీ, అస్తమా లాంటి లక్షణాలు ఉన్నవారు రక్తదానం చేయకూడదు. రక్తదానంతో ప్రాణాలనే కానుకగా ఇవ్వవచ్చు. మరే ప్రత్యామ్నాయం లేని అత్యంత విలువైన రక్తాన్ని దానం చేయడానికి 10 – 15 నిమిషాల సమయం మాత్రమే పడుతుంది. భారతీయ యువత స్వచ్ఛందంగా కనీసం ఏడాదికి 2 – 3 సార్లు అయినా రక్తదానం చేస్తూ, అవసరార్థుల ప్రాణాలను కాపాడుదాం. రక్తదానమే మహాదానమని నినదిద్దాం.

# అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తత ఏదీ?

అగ్ని వలన జరిగే ప్రమాదాలను అగ్ని ప్రమాదాలు అంటారు. ఇవి వేడి ఎక్కువగా ఉండే వేసవి కాలంలో ఎక్కువగా జరుగుతాయి. ఈ ప్రమాదాల వలన ఎంతో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం సంభవిస్తుంది. పాదచారులు, గుర్తు తెలియని వ్యక్తులు బీడీలు, సిగరెట్లు తాగి వాటిని ఆర్పకుండా అలాగే పారేస్తుండటంతో అవి అంటుకొని మంటలు పాకి ప్రమాద ఘటనలు తరచుగా జరుగుతున్నాయి. అగ్నిమాపక శాఖను కేవలం అగ్నిప్రమాదాలకే పరిమితం కాకుండా ప్రకృతి వైపరీత్యాలు, రోడ్డు, రైలు ప్రమాదాలు, వానలు, వరదలు, భూకంపాలు... ఇతర ప్రాణాపాయ పరిస్థితులు ప్రజలకు ఏర్పడినప్పుడు విపత్తుల శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగుతారు. బాధితులు, ఆర్తులకు అవసరమైన సేవలు అందించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని సాధ్యమైనంత తగ్గించడానికి ప్రయత్నిస్తారు. 101 నెంబరుకు ఫోన్ చేస్తే శాఖాపరంగా బాధితులకు అవసరమైన సేవలు అందిస్తారు. అగ్ని ప్రమాదం సమయంలో ప్రతి క్షణం విలువైనది. వీలైనంత మేరకు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించ గలిగితే, ఎక్కువ నష్టం కలుగకుండా నివారించ వచ్చు. ఆస్తి, ప్రాణనష్టం లేకుండా చూడవచ్చు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101కు ఫోన్ చేసి వివరాలను తెలియ చేయాలి. ప్రమాద సంఘటన గురించి వివరించాలి.

విద్యుదాఘాతం, ఎండ వేడిమి ప్రమాదాలకు కారణాల వుతున్నా, ప్రకృతి వైపరీత్యాల వల్ల సంభవించే బీభత్సాలను పక్కన పెడితే మనిషి అజాగ్రత్త వల్ల జరిగే అగ్నిప్రమాదాలే ఎక్కువ జరుగుతున్నాయి. ఎండా కాలంలో ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా పెద్దపెద్ద అగ్నిప్రమాదాలు జరిగే ఆస్కారముంది. ముందు జాగ్రత్తగా కొన్ని నియమాలను పాటిస్తే వాటిని అరికట్ట వచ్చు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో ప్రమాదాలు సంభవించిన ప్పుడు కంగారు, అయోమ యానికి గురికాకుండ ఉ ండాలి. గందరగోళం తొక్కిసలాటకు దారితీసి, అగ్ని ప్రమాదం కన్నా పెద్ద దుర్ఘటనకు కారణం కావొచ్చు.

ఆసుపత్రులు, హొటళ్ళు, షాపింగ్ కాంప్లెక్సుల చుట్టు ఫైర్ ఇంజన్ తిరిగేందుకు వీలుగా అవసరమైన ఖాళీ స్థలం ఉండాలి. భవనాలు చుట్టూ, ముందు భాగంలో గాలి వెలుతురు వచ్చే కిటికీలు ఏర్పాటు చేయాలి. భవనాలు ముందు పెద్ద సైజ్ హొర్డింగ్‌లు ఏర్పాటు చేయకూడదు. అధిక నీటి సామర్థ్యం గల ట్యాంకులను అమర్చుకోవాలి. నీళ్ళు తోడటానికి అనువుగా మోటార్‌ను అమర్చాలి. భవనాలకు ఒకే స్టెయిర్ కేసు కాకుండా అత్యవసర సందర్భాల్లో ఉపయోగించ టానికి మరో స్టెయిర్‌కేస్ సమకూర్చు కోవాలి. ఎమర్జెన్సీలో విద్యుత్ సరఫరా నిలిచిపోయేలా సర్క్యూట్ బ్రేకర్లు అమర్చుకోవాలి. విద్యా సంస్థలు, ఫ్యాక్టరీలు, ఆసుపత్రులు, సినిమా హాళ్లు తదితర వాటిల్లో కచ్చితంగా అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.ఇళ్లల్లో వంట గ్యాస్‌కనెక్షన్లు, వాటి ఫిట్టింగులు సరిగ్గా ఉన్నాయా లేదా ఎప్పటికప్పుడు సరిచూసు కోవాలి.

స్టౌ మండుతున్న సమయంలో జాగ్రత్త అవసరం. మండుతున్న పొయ్యికి దూరంగా ఉండి వస్తువులను ఉపయో గించాలి. అగ్గిపెట్టెలు, లైటర్లు, కిరోసిన దీపాలను దూరంగా ఉంచాలి. కాగితం వంటి మండే పదార్థం, వస్త్రం, కలప, పెయింట్స్, ఎల్పిజి సిలిండర్లు, ప్లాస్టిక్ సాధారణంగా భవనాలలో నిల్వ చేయ బడతాయి. ఇది ఎక్కువ ప్రమాదాన్ని కలిగిస్తుంది. ప్రధానంగా దీపావళి సందర్భంగా బాణాసంచా కాల్చడం వల్ల సామాన్యంగా అగ్ని ప్రమాదాలు జరుగుతాయి. వీటి పట్ల పిల్లలకు అవగాహన కల్పించాలి. అగ్ని ప్రమాదం సంభించినపుడు ఇంటి తలుపులు మూసి పొరుగు వారిని పిలవాలి. ప్రమాదం జరగగానే అగ్నిమాపక కేంద్రానికి సమాచార మందించాలి.అగ్ని ప్రమాదం జరిగినపుడు కంగారు పడక, జాగ్రత్తగా వ్యవహరించాలి. దుస్తులకు నిప్పంటు కున్నప్పుడు పరుగెత్తడానికి ప్రయత్నించక, నేలమీద పడుకుని దుప్పటి లేదా రగ్గు శరీరం మొత్తం చుట్టుకుని పొర్లటం వల్ల మంటలను అర్పు కోవాలి. ఒళ్లు కాలి గాయమైతే వదులుగా ఉండే దుస్తులను ధరించి వైద్యుడి దగ్గరకెళ్లి చికిత్స చేయించుకోవాలి..

## బాల్యానికి భరోసా ఏదీ?

ప్రపంచవ్యాప్తంగా బాలకార్మికుల దయనీయ స్థితిని గుర్తించి, వారి జీవితాలను బాగుపరచడం కోసం ఐక్యరాజ్యసమితి ప్రతియేటా ఒక నినాదంతో కార్యక్రమాలు నిర్వహిస్తోంది. బాల్యం ఓ అందమైన కల.. ఆనందాల అల.. అపురూపమైన మధురానుభూతి. గడచిపోయిన అందమైన బాల్యం మళ్లీ తిరిగొస్తే బావుండు అని అనుకోని వారెవరైనా ఉంటారా.! కానీ ప్రస్తుతం సమాజంలో బాల్యం ఎందరికో భారంగా మారింది. అనేక కారణాల వల్ల కొన్ని బాల్యాలు చీకట్లలోనే మగ్గుతున్నాయి. పలకా బలపం పట్టి బుడి బుడి నడకలతో సందడి చేయాల్సిన వసివాడని పసి చేతులు కారా?నాల పాలవుతున్నాయి. రేంచీలు, సుత్తులు, రాడ్లరాపిళ్ళతో కందిపోయి, పాల చేతులు కాస్తామడ్డి కొట్టుకు పోతున్నాయి. చిట్టి చిట్టి చేతులతో చిన్నారులు బాల కార్మికులుగా మారుతున్నారు. ఆడిపాడాల్సిన వయస్సులో నాలుగు గోడల మధ్య బందీ అవుతున్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో విజ్ఞానవంతులు కావాల్సిన పిల్లలకు తగిన ఆదాయాలు లేక తల్లిదండ్రులు పౌష్టికాహారం అందించలేకపోతున్నారు. నిజంగానే పిల్లలను బాలకార్మికులుగా మారకుండా రక్షించుకోవలసిన అవసరం గతంలో కంటే ఇప్పుడు ఎక్కువగా ఉంది. ప్రపంచంలోని అనేక దేశాల్లో స్వయంగా పిల్లల తల్లిదండ్రులు, పెద్దలు తమ స్వార్థం కోసం, స్వలాభం కోసం పసి పాపల నిండు జీవితాలు బుగ్గిపాలు చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు, అల్పాదాయ పరిస్థితుల మూలంగా చిన్న చిన్న పిల్లలను పనులకు పంపి కుటుంబాలను లాక్కొస్తున్నారు. చట్టపరంగా పసి వారికున్న హక్కులు, సౌకర్యాల గురించి వారికి ఏ మాత్రం తెలియదు. తెలిసినా దాంతో వారికి నిమిత్తం లేదు. పిల్లల హక్కుల చట్టాలను గురించి తెలిసిన వారు, అమలు చేస్తున్నవారు చాలా తక్కువ మంది. వివిధ రంగాలలో బాల కార్మికుల స్వేద బిందువులను పెట్టుబడిగా పెట్టి లాభాలు గడిస్తున్నవారు, చివరికి వారిని సంఘ వ్యతిరేక శక్తులుగా తయారు చేసి, వారిని వినియోగించుకొని, వారి భవిష్యత్తును ఛిన్నాభిన్నం చేసేవారు, చేస్తున్నవారు సమాజంలో లేకపోలేదు. అభం శుభం తెలియని అలాంటి పసి జీవితాల గురించి ఆలోచిస్తేనే గుండె తరుక్కుపోతుంది. ఎంతోమంది చిన్న పిల్లలు హొటళ్లలో, రెస్టారెంట్లలో, మెకానిక్ షెడ్లలో, గ్యారేజీల్లో, కర్మాగారాలు, పరిశ్రమల్లో వెట్టిచాకిరీ చేస్తూ, యజమానుల ఇళ్ళలో గొడ్డు చాకిరీ చేస్తూ, రోడ్లపై కాగితాలు, ప్లాస్టిక్, గాజు సీసాలు ఏరుకుంటూ.. తగినంత వేతనం కానీ, కడుపునిండా తిండి గాని, తగిన సదుపాయాలు గాని లేక నిస్సహాయ స్థితిలో దారుణంగా నలిగి పోతున్నారు. ముష్టివాళ్ళు గా మారిపోతున్నారు. మరో దురదృష్టకరమైన, భయంకర వాస్తవం ఏమిటంటే, కొంతమంది అమాయక పసి బాలికలు అతి చిన్న వయసులోనే బలవంతంగా వ్యభిచార కూపంలోకి నెట్టివేయబడుతున్నారు. ఈ అమాయక ప్రాణులు అలాంటి మురికి కూపాల్లో పడకుండా ఎవరు రక్షించాలి? పడిన వారిని ఎవరు బయటకు తీయాలి? వీరిని ఎవరు ఆదరించాలి? వీరందరికీ స్వేచ్ఛగా, ఆనందంగా, ఆహ్లాదంగా జీవించే హక్కు ఉన్నదని ఎవరు చెప్పాలి? ప్రస్తుతం ఎంతో కొంత ఈ పని చేస్తున్నది స్వచ్ఛంద సంస్థలే.. ప్రాథమిక విద్య దశలోనే పిల్లలు బడి మానేయకుండా, మధ్యలోనే చదువు ఆపేయకుండా చూడగలిగితే, సమస్య తీవ్రతను చాలా వరకు తగ్గించవచ్చు. పిల్లలకు చదువు ద్వారానే మంచి భవిష్యత్తు దక్కుతుందన్న విశ్వాసాన్ని, తద్వారా పిల్లల చదువు కోసం ఒక బలమైన కోరికను తల్లిదండ్రుల్లో రగిలించాలి. బాల కార్మిక సమస్య నిర్మూలనకు ఇదొక్కటే సరైన మార్గం. ఒక్కసారి పిల్లల్ని పనికి పంపించడం మంచిది కాదని, అదేమంత అవసరం కూడా కాదని ఒప్పించగలిగితే పిల్లల్ని పాఠశాలలో చేర్పించడం చాలా సులువైపోతుంది. ఎప్పుడైతే సమాజం పాఠశాల నుంచి ఎక్కువ ఫలితాన్ని ఆశిస్తుందో, అప్పుడు పాఠశాల గురించి పట్టించుకోవడం జరుగుతుంది. తద్వారా విద్యా బోధనలో వాసి దానంతట అదే రాక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. పిల్లల అవసరాలకు తగ్గట్టుగా పాఠశాల బాధ్యతల్లో విప్లవాత్మకమైన మార్పులు సంభవిస్తాయి. పిల్లలు బాగుంటేనే దేశ భవితవ్యం బాగుటుంది. కనుక చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించి మంచి భవిష్యత్తును అందించేందుకు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిర్వర్తిస్తే బాలకార్మిక వ్యవస్థ నిర్మూలించబడి, భావిభారత పౌరుల భవిష్యత్తు బంగారు మయం అవుతుందనడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు.

# ఐరోపా ఎన్నికల్లో... విజృంభిస్తున్న మితవాదశక్తులు..!

ఐరోపా యూనియన్ లోని 27 దేశాలలో జూన్ ఆరు నుంచి తొమ్మిదవ తేదీ వరకు జరిగిన యూనియన్ పదవ పార్లమెంటు ఎన్నికల ఫలితాల్లో ఆందోళనకర సూచనలు వెలువడ్డాయి. అధికారికంగా ఫలితాల పూర్తి ప్రకటన వెలువడలేదు. నాలుగు దేశాల్లో లెక్కింపు కొనసాగుతోంది. మంగళవారం సాయంత్రానికి అందిన సమాచారం, ఫలితాల తీరుతెన్నుల ప్రకారం నయా నాజీ, ఫాసిస్టు, పచ్చి మితవాద శక్తులు బలం పుంజుకున్నాయి. ఈ పరిణామం ఐరోపా విధానాలనే తీవ్రంగా ప్రభావితం చేసేదిగా ఉంది. వివిధ దేశాలలో పాలక పార్టీలు, కూటములకు ఎదురు దెబ్బలు తగిలాయి. ఐరోపా సమాఖ్య వైఖరిలో వచ్చే మార్పులు, చేర్పుల గురించి చర్చ ప్రారంభమైంది. పార్లమెంటులోని మొత్తం 720 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మెజారిటీ 361 స్థానాలు సాధించిన కూటమి ఎంచుకున్న నేత ఐరోపా కమిషన్ అధ్యక్ష పదవిని అధిష్టిస్తారు. కమిషన్ విధానాలను ఐరోపా పార్లమెంటు రూపొందిస్తుంది. ప్రతిదేశానికి జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తారు. ఈ ఎన్నికలలో ప్రస్తుతం సమాఖ్య అధ్యక్షురాలిగా ఉన్న ఉర్సులా వాండరె లెయన్ నాయకత్వంలోని యూరోపియన్ పీపుల్స్ పార్టీ (ఇపిపి) 191 సీట్లతో పెద్ద పక్షంగా అవతరించింది. పచ్చి మితవాదులను అధికారంలోకి రాకుండా నిరోధించగలమని ఆమె చెప్పింది. మరోసారి ఆమె సమాఖ్య అధ్యక్ష స్థానం కోసం పోటీలో ఉన్నారు. ఐరోపా రాజకీయ పరిభాషలో ఇపిపిని మధ్యేవాద మితవాద పార్టీగా పరిగణిస్తారు. ఫ్రాన్సులో మారిన్ లీపెన్స్ నాయకత్వంలోని పచ్చి మితవాద ఐడెంటిటీ (ఉనికి)–డెమోక్రసీ (ప్రజాస్వామ్య) పార్టీ(ఐ.డి)కి 57 వచ్చాయి. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ నాయకత్వంలోని యూరోపియన్ కన్జర్వేటివ్, రిఫార్మిస్టు (ఇసిఆర్) పార్టీకి 71 వచ్చాయి. ఈ మూడు పక్షాలూ గతం కంటే ఎక్కువ సీట్లు తెచ్చుకున్నాయి. సోషలిస్టు మరియు డెమొక్రాట్స్ కూటమి (ఎస్.డి) రెండవ పెద్ద పక్షంగా 135 సీట్లు తెచ్చుకుంది. గుర్తింపు పొందని చిన్న పక్షాలు 95 గెలుచుకున్నాయి. గ్రీన్స్ పార్టీ 53, రెన్యూ (పునరుద్ధరణ) యూరోప్ (ఆర్.ఇ) 83, ఐరోపా వామపక్ష పార్టీ 35 సీట్లు తెచ్చుకుంది. గత ఎన్నికల్లో ఐరోపా కమిషన్ అధ్యక్షురాలిగా ఉ ర్సులా వాండెర్ లెయాన్ అభ్యర్థిత్వాన్ని సమర్థించి గెలిపించిన పార్టీలు తాజా ఎన్నికల్లో 720కి గాను 402 స్థానాలను తెచ్చుకున్నట్లు వెల్లడైంది. అందువలన ఆమె తిరిగి మరోసారి అదే పదవిలో కొనసాగవచ్చు. ఆమె గనుక పచ్చి మితవాద పార్టీల మద్దతు కోసం ప్రయత్నిస్తే తాము దూరంగా ఉంటామని, ఉదారవాద, మితవాద పార్టీల ప్రతినిధులు హెచ్చరించారు. ఆమె బలహీన పడిన గ్రీన్స్, ఇటలీ మితవాది మెలోనీ పార్టీ మద్దతు కోరవచ్చని కొందరు విశ్లేషకులు జోశ్యం చెప్పారు. హంగరీలో జాతీయవాద నేత విక్టర్ ఒర్బాన్ పార్టీ బలం తగ్గినా 44 శాతం తెచ్చుకుంది. ఇటలీలో మితవాద ప్రధాని మెలోనీ పార్టీ 30 శాతం తెచ్చుకుంది. ఫ్రెంచి పార్లమెంటును ఆకస్మికంగా రద్దు చేయటంతో ఫ్రాన్స్‌లో సంకీర్ణ రాజకీయాలకు తెరలేచింది. ఈ నెల 30, జులై ఏడున ఎన్నికలు జరగనున్నాయి. పదహారవ తేదీలోగా అభ్యర్థుల ప్రకటన జరుగుతుంది. అధ్యక్షుడు మాక్రాన్ ప్రకటన వెలువడిన వెంటనే ఐడి పార్టీ నాయకురాలు మారిన్ లీపెన్ దేశ పౌరులు ఈ ఎన్నికల్లో కూడా తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఐరోపా పార్లమెంటు ఎన్నికల్లో ఆమె పార్టీ 31.5 శాతం ఓట్లతో ప్రథమ స్థానంలో ఉంది. గతంలో నేషనల్ ఫ్రంట్ పేరుతో పార్టీని ఏర్పాటు చేసిన జీన్ మారీ లీపెన్ కుమార్తె మేరీనే కాగా మనుమరాలు మారియో మార్చెల్ ఆమెతో వేరుపడి రికగ్నిట్ పేరుతో మరో పచ్చి మితవాద పార్టీని ఏర్పాటు చేసింది. ఎన్నికల సమయంలో మేనత్త మీద ఎలాంటి విమర్శలూ చేయలేదు, మితవాదులందరూ కలవాల్సిన అవసరం గతం కంటే నేడు ఎక్కువగా ఉందంటూ ఎన్నికల ఫలితాల తరువాత మారియో వ్యాఖ్యానించింది. మాక్రాన్ నాయకత్వాన్ని వ్యతిరేకించే మితవాద పార్టీలు మేరీ లీపెన్, మార్చెల్‌తో కలిసే అవకాశాలు ఉ న్నాయి. వివిధ పార్టీలలో చీలికలు తెచ్చి తనవైపు తిప్పుకొనేందుకు మాక్రాన్ ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించాడు. అతగాడి అధ్యక్ష పదవీకాలం 2027 వరకు ఉంది. పార్లమెంటులో ప్రతిపక్షాలకు మెజారిటీ ఉంటే ఇబ్బంది కనుక వాటిని అడ్డుకొనేందుకు సర్వశక్తులూ వడ్డాలని చూస్తున్నాడు. సోషలిస్టులు, గ్రీన్స్, మరికొన్ని వామపక్ష పార్టీలు కూడా కూటమిగా ఏర్పడేందుకు చూస్తున్నాయి. ఐరోపా యూనియన్ ఎన్నికలలో సోషలిస్టు పార్టీ (పిఎస్)కు 14 శాతం ఓట్లు వచ్చాయి. కొన్ని సర్వేల ప్రకారం ప్రస్తుతం ఉన్న సీట్లలో మక్రాన్ నాయకత్వంలోని రినైజాన్స్ పార్టీ (ఆర్.ఎన్) సగం స్థానాలను కోల్పోనున్నట్లు వెల్లడైంది. జర్మనీలో పాలక కూటమిలోని సోషల్ డెమొక్రటిక్ పార్టీ (ఎస్‌పిడి) 13.9 శాతం ఓట్లు తెచ్చుకొని మూడవ స్థానంలో ఉంది. పచ్చి మితవాద పార్టీ ఏఎఫ్‌డి 16 శాతం తెచ్చుకొని చరిత్ర సృష్టించింది. ప్రతిపక్ష క్రిస్టియన్ డెమొక్రటిక్ యూనియన్–క్రిస్టియన్ సోషల్ యూనియన్ కూటమి 30 శాతం తెచ్చుకొని ప్రథమ స్థానంలో ఉంది. తూర్పు జర్మనీ ప్రాంతంలో ఎఎఫ్‌డి అగ్రస్థానంలో ఉంది. సంకీర్ణ కూటమిలోని సోషల్ డెమొక్రాట్స్ (ఎస్‌పిడి), పర్యావరణ గ్రీన్స్, ఫ్రీ డెమొక్రాట్స్ పార్టీలు వరుసగా 13.9–11.9–5.2 శాతాల చొప్పున తెచ్చుకొని చావు దెబ్బతిన్నాయి. దీంతో వెంటనే ఎన్నికలు జరపాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది. నాలుగింట మూడు వంతుల మంది జనం కూటమి పాలన పట్ల అసంతృప్తితో ఉన్నారని ఎన్నికల సర్వేలు వెల్లడించాయి. ఉక్రెయిన్ సంక్షోభం, గాజాలో జరుగుతున్న పరిణామాలు, ఐరోపా అంతటా కొనసాగుతున్న ఆర్థిక సంక్షోభం వంటి అంశాలన్నింటి కారణంగా మరింత భద్రత కావాలని ఓటర్లు కోరుకున్నారని, దాని మీద పచ్చి మితవాదులు వాగ్దానం చేశారని, ఈ ఎన్నికలు జాతీయ నాయకుల మీద జరిగిన ప్రజాభిప్రాయ వెల్లడి అని ఐరోపా సమాఖ్య విదేశీ సంబంధాల డిప్యూటీ డైరెక్టర్ వెసెలా టెక్నర్‌నెవా అన్నారు. ఐరోపాలో ఫాసిస్టు, నాజీ, పచ్చి మితవాద శక్తులు పుంజుకోవటమే కాదు, తమ స్థానాన్ని సుస్థిరం చేసుకుంటున్న ధోరణి కనిపిస్తున్నది. అయితే ఈ ఎన్నికల్లో అనేక మంది ఊహించిన మాదిరి అవి ఎక్కువ బలాన్ని పెంచుకోలేదు. మూడో వంతు సీట్లు తెచ్చుకోవటం రానున్న ముప్పును వెల్లడిస్తున్నది. ఇప్పటివరకు అనేక కారణాలతో వివిధ దేశాల్లోని ఈ శక్తుల మధ్య ఐక్యత లేదు, అసంఘటితంగా కూడా ఉన్నాయి. ఎవరికి వారుగానే పని చేస్తున్నారు. మితవాదులు, పచ్చిమితవాదులకు స్వల్ప తేడాలు మాత్రమే ఉన్నాయి. ఆర్థిక సంక్షోభం కొనసాగుతున్న పూర్వ రంగంలో పార్లమెంట్‌లో ఈ శక్తులు కలిస్తే పరిణామాలు ఎలా వుండేదీ చెప్పలేము. ఒక వేళ అదే జరిగితే వాటిని వ్యతిరేకించే వారందరూ ఒక కూటమిగా ఏర్పడవచ్చు, వారితో వామపక్షాలు కూడా చేతులు కలిపే అవకాశం లేకపోలేదు. పచ్చి మితవాద శక్తులు బలం పుంజుకోవటం వలన పర్యావరణ, వలసలు, ఉక్రెయిన్‌కు సాయంతో సహా విదేశాంగ విధానంలో మార్పుల కోసం పట్టు పట్టవచ్చు, వేగంగా నిర్ణయాలు తీసుకోవటాన్ని అడ్డుకోవచ్చు.

# మరో యాత్రకు రాహుల్



**లక్నో, జూన్ :** సార్వత్రిక సమరంలో ఫలితాలు దాదాపు తారుమారయ్యాయి. మూడో సారి ప్రధానిగా అధికారం చేపట్టనున్న మోదీకి ఈ ఎన్నికలు చక్కని గుణపాఠం చెప్పాయి. ముఖ్యంగా మత రాజకీయాలు, మత విద్వేషాలతో ఓట్లు రావన్న సంగతి ఇప్పటికైనా బీజేపీ నేతలు గుర్తించాలని రాజకీయ విమర్శకులు సూచిస్తున్నారు. ముఖ్యంగా యూపీలోనే బీజేపీకి మెజారిటీ స్థానాలు తగ్గిపోయాయి. అనూహ్యంగా కాంగ్రెస్ కూటమికి అత్యధిక సీట్లు వచ్చాయి. ఈ ప్రభావం యూపీలో వచ్చే అసెంబ్లీ ఎన్నికలపై పడినా ఆశ్చర్యపోనక్కర్లేదు. అందుకే రాహుల్, అఖిలేష్ ఆధ్వర్యంలో యూపీ ప్రజలకు ధన్యవాదాలు తెలిపేందుకు కాంగ్రెస్ కూటమి సిద్ధం అవుతోంది. మొత్తం యూపీలోని 403 అసెంబ్లీ నియోజకవర్గాలలో 'ధన్యవాద్ యాత్ర' పేరిట ఈ యాత్ర ఉండబోతోంది. ఈ ధన్యవాద్ యాత్ర 15న ముగుస్తుంది. ఈ యాత్రలో కూటమి సీనియర్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. యాత్రలో భాగంగా సమాజాంలోని పలు వర్గాలకు చెందిన వారికి రాజ్యాంగం కాపీలను బహుకరించనున్నారు. యూపీలో మొత్తం 80 పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. ఇక కాంగ్రెస్ కూటమి ఏకంగా 43 సీట్లు కైవసం చేసుకోగా బీజేపీ 33 సీట్లకే పరిమితం అయింది. సమాజ్ వాదీ పార్టీ 37.. కాంగ్రెస్ 6 స్థానాల్లో గెలుపొందింది. కాంగ్రెస్ కంచుకోట రాయ్ బరేలీ నుంచి రాహుల్ గాంధీ ఘన విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో బీజేపీ 62 సీట్లు గెలుచుకోగా.. ఎస్పీ ఒక స్థానం, కాంగ్రెస్ 5 స్థానాల్లోనే గెలుపొందింది. యూపీలో బీజేపీ కూటమి ఓటమికి బలీయమైన కారణం ఆ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం రెండూ ఆర్థిక వ్యవస్థ పరిస్థితిని చర్చనీయాంశంగా చేశాయి. అధికారిక లెక్కల ప్రకారం 2017 నుంచి 2021 వరకూ యూపీ ఆర్థిక వ్యవస్థ యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలో ఆశించిన స్థాయిలో రాణించలేదు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి కేవలం 1.95 శాతం చొప్పున మాత్రమే వృద్ధి సాధించింది. ఇక తలసరి ఆదాయ వృద్ధి సంవత్సరానికి 0.43 శాతం మాత్రమే. అంతకు ముందు అంటే 2012-17 మధ్యకాలంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి సంవత్సరానికి 6.92 శాతం చొప్పను పెరిగింది. 2007-12 మధ్యకాలంలో బీఎస్పీ అధినేత్రి మాయావతి కాలంలో 7.28 శాతం చొప్పన పెరిగింది. యోగా అధిత్యనాథ్ హయాంలో శాంతి భద్రతలు అదుపులో ఉన్నప్పటికీ నేరస్థులపై యోగి అనుసరించిన విధానం పౌర హక్కులకు భంగం కలిగించే రీతిలో ఉన్నాయయి విమర్శలొచ్చాయి. పైగా యోగికి బుల్డోజర్ బాబాగా అపఖ్యాతి వచ్చింది. నేరస్థుల ఇళ్లపై బుల్డోజర్ పంపి కూల్చివేయడం వంటి చర్యలు అన్నీ బీజేపీపై వ్యతిరేకత పెంచేలా చేశాయియూపీలో ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా యమునా, గంగ ఎక్స్‌ప్రెస్ వే, సనౌటా?పుర్కాజీ ఎక్స్‌ప్రెస్ వే, వారణాసి ?నోయిడాల మధ్య ఎనిమిది లేన్ల రహదారి వంటి అనేక భారీ ప్రాజెక్టులు మొదలయ్యాయి. అలాగే కుశినగర్, జేవార్‌ల వద్ద అంతర్జాతీయ విమానాశ్రయానికీ ప్రణాళిక సిద్ధమైంది. కానీ, ఈ రెండింటికీ బీజం పడ్డది మాయావతి కాలంలో. అఖిలేశ్ ఈ ఆలోచనలను కొనసాగించారు. మొత్తం మీద 2024 ఎన్నికలు హిందూత్వ భావజాలానికీ, సామాజిక న్యాయాన్ని కోరే మండల్ వర్గాలకూ మధ్య హోరాహోరీగానే సాగింది. రాముడి చుట్టూ తిరిగిన రాజకీయాలను కాస్తా ప్రజల జీవనోపాధి సమస్యల వైపు మళ్లించిన ఘనత 'ఇండియా' కూటమికి దక్కుతుంది. ఇంకోలా చెప్పాలంటే 2014 తరువాత మొదటిసారి బీజేపీ మతతత్వ పాచిక పారలేదని చెప్పాలి.

# అప్పుడు హీరో హీరోయిన్లు


## - ఇప్పుడు మంత్రి, ఎంపీలు



**న్యూఢిల్లీ, జూన్ :** సినిమాలు, రాజకీయాలు ఒకదానికి ఒకటి పెనవేసుకుని ఉంటాయనే విషయం అందరికీ తెలిసిందే. సినిమా వాళ్లు రాజకీయాల్లోకి రావడం,, పొలిటీషియన్స్ సినిమాలు చేయడం ఇప్పుడు సర్వ సాధారణం. ఇప్పుడు చెప్పబోయే అలాంటి ఓ అసక్తికరమైన విషయం తాజా లోక్‌సభ ఎన్నికల్లో జరిగింది. బాలీవుడ్‌లో ఓ సినిమాలో హీరో హీరోయిన్లుగా నటించిన రొమాన్స్ చేసిన ఓ జంట పార్లమెంట్ సభ్యులు అవడమే కాక, అందులో ఒకరు మంత్రి కావడం గమనార్హం. ఈ జంటే చిరాగ్ పాశ్వాన్ (, కంగనా రనౌత్ ఇందులో కంగనా రనౌత్ మొదటి సారి ఎంపీగా ఎన్నికవ్వగా పాశ్వాన్ మూడోసారి లోక్‌సభకు ఎన్నికవడమే కాకుండా మినిష్టర్‌గా బాధ్యతలు చేపట్టడం విశేషం. 2011లో వచ్చిన మిలే నా మిలే హమ్ అనే చిత్రంతో అప్పటికే దేశ రాజకీయాల్లో మంచి పేరున్న ఎల్జేపీ పార్టీ అధ్యక్షుడు రామ్ విలాస్ పాశ్వాన్ కుమారుడు చిరాగ్ పాశ్వాన్ సినిమా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టాడు. అతని సరసన అప్పటికే నాలుగైదు సినిమాల్లో నటించిన కంగనా రనౌత్ కథానాయికగా నటించింది. ఈ జంటపై రెండు మూడు పాటలు కూడా ఉండగా ఈ సినిమా ప్రేక్షకులను ఏమాత్రం మెప్పించలేక పోయింది. ఈ చిత్రం తర్వాత చిరాగ్ పాశ్వాన్ తన తండ్రికి మద్దతుగా రాజకీయాల్లోకి వెళ్లి 2014లో ఎంపీ అయి పూర్తి స్థాయి రాజకీయాల్లో బిజీ అయ్యారు. తండ్రి మరణానంతరం తమ ఎల్జేపీ పార్టీకి అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ పార్టీని ముందుండి నడుపుతున్నారు. తాజాగా జరిగిన ఎలక్షన్‌లో మరోసారి ఎంపీగా విజయం సాధించిన ఆయన కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఇక కంగనాఆ తర్వాత అదే సంవత్సరం వచ్చిన తను వెడ్స్ మను సినిమాతో స్టార్‌గా ఎదిగి జాతీయ అవార్డులు సైతం గెలుచుకుంది. ఆ తర్వాత బాలీవుడ్‌లో బిజీయెస్ట్ తారగా మారి వరుస సినిమాలతో దూసుకుపోయింది. అంతేకాక బాలీవుడ్‌పై, అడపాదడపా శివసేన వంటి పార్టీలపై తన కామెంట్స్‌తో వార్తల్లో నిలిస్తూ వచ్చిన బీజేపీలో చేరిన కంగనా ఇటీవల జరిగిన ఎన్నికల్లో హిమాచల్ ప్రదేశ్ నుంచి ఎంపీగా గెలిచి పార్లమెంట్‌లో అడుగుపెట్టింది. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో పాశ్వాన్, కంగనాలు ఎంపీ హోదాలో కలుసుకుని ఒకరికొకరు అప్యాయంగా పలకరించకున్నారు. ఈ సందర్భంగా వారిద్దరు కలిసి దిగిన ఫొటోలు సోషల్ మీబడియాలో బాగా వైరల్ కూడా అయ్యాయి. ఈజంట కలిసి నటించిన మిలే నా మిలే హమ్ అనే చిత్రం ప్రస్తుతం యూ ట్యూబ్‌లో అందుబాటులో ఉన్నది. ఆసక్తి ఉన్నవారు చూడొచ్చు.

# హర్యానా లెక్కే వేరప్పా


**ఛండీఘడ్, జూన్:** అదృష్టం అంటే వీరిదే.. ఆ రాష్ట్రంలో గెలిచింది ఐదుగురైతే.. ఏకంగా ముగ్గురికి మంత్రి పదవులు లభించాయి.. దీంతో ఆ రాష్ట్రంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.. ఇంతకీ ఆ రాష్ట్రంలో ఏం జరిగింది. మోదీ ఎలాంటి ప్లాన్ వేశారు? మూడోసారి దేశ ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం చేశారు. 72 మందితో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఇందులో పార్టీ ప్రాధాన్యతలు, అవసరాల ఆధారంగా కొంతమందికి స్థానం లభించింది. అయితే హర్యానా రాష్ట్రానికి ఏకంగా మూడు మంత్రి పదవులు లభించడం ఆసక్తికరంగా మారింది. వాస్తవానికి హర్యానా ఉత్తర ప్రదేశ్ లాగా పెద్ద రాష్ట్రం కాదు. మధ్యప్రదేశ్ లాగా బిజెపి క్లీన్ స్వీప్ చేయలేదు. అయినప్పటికీ ఆ రాష్ట్రానికి మూడు కేంద్రమంత్రి పదవులు ఇవ్వడం సరికొత్త చర్చకు దారితీస్తోంది. హర్యానా రాష్ట్రంలో 90 అసెంబ్లీ, పది పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి.. ఇటీవల ఎన్నికల్లో ఈ రాష్ట్రంలో బిజెపి ఐదు పార్లమెంటు స్థానాలు మాత్రమే గెలుచుకుంది. అయితే ఆ ఐదుగురిలో ముగ్గురికి కేంద్ర మంత్రివర్గంలో చోటు ఇచ్చింది. చదువుతుంటే ఆశ్చర్యంగా అనిపించినప్పటికీ.. గతానికంటే భిన్నంగా ఈసారి మోదీ హర్యానా రాష్ట్రానికి విపరీతమైన ప్రాధాన్యమిచ్చారు.. ఇందుకు కారణం లేకపోలేదు. ఎందుకంటే త్వరలో హర్యానా రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. దీంతో ఆ రాష్ట్రంపై బిజెపి ప్రధానంగా దృష్టి సారించినట్టు తెలుస్తోంది. హర్యానాతోపాటు మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాలలోనూ ఈ ఏడాది ఎన్నికలు జరగనున్నాయి. హర్యానా రాష్ట్రం ఢిల్లీకి అత్యంత సమీపంలో ఉంటుంది.. మరో నాలుగు నెలల్లో అక్కడ ఎన్నికలు జరగనున్నాయి. అక్కడ ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉంది. అయితే ఈసారి జరిగే ఎన్నికల్లో ఇక్కడికి గెలవాలని బిజెపి భారీగా ఆశలు పెట్టుకుంది. ఒకవేళ హర్యానా రాష్ట్రంలో ఓడిపోతే ఆ ప్రభావం కేంద్ర ప్రభుత్వంపై ఎంతో కొంత ఉంటుంది. దీంతో హర్యానా రాష్ట్రంలో




గెలుపును కమలం పార్టీ నాయకులు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. అందువల్లే ఐదుగురు పార్లమెంటు సభ్యులు గెలిచినప్పటికీ ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. హర్యానా మాజీ ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ను మంత్రివర్గంలోకి తీసుకోవడం వెనుక అసలు కారణం అదే అని విశ్లేషకులు భావిస్తున్నారు. హర్యానా రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం మైనారిటీలో ఉంది.. 90 అసెంబ్లీ స్థానంలో ఉన్న ఈ రాష్ట్రంలో అధికారాన్ని దక్కించుకోవాలంటే 46 సీట్లను గెలుచుకోవాలి. ఈ రాష్ట్రంలో బిజెపికి 41 స్థానాలు ఉన్నాయి. హెచ్‌ఎల్ పీ, మరో స్వతంత్ర అభ్యర్థి ఎన్డీఏలో చేరడంతో బిజెపి బలం 43 కు చేరుకుంది. ప్రస్తుతం అక్కడ మూడు ఎమ్మెల్యే స్థానాలు వేకెన్ట్ లో ఉన్నాయి. దీంతో అక్కడ ప్రభుత్వ ఏర్పాటుకు 44 మంది ఎమ్మెల్యేల బలం అవసరం ఉంది. బిజెపికి 43 మంది మాత్రమే ఉన్నారు.. అయితే ఎన్నికలకు మరో నాలుగు నెలల సమయం మాత్రమే ఉండడంతో ఇక్కడ ప్రభుత్వం కూలిపోయే అవకాశాలు లేకపోలేదు.. ఇక ఇండియా కూటమి కూడా త్వరలో జరిగే ఎన్నికల్లో విజయాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ నేపథ్యంలో మరో నాలుగు నెలల్లో జరిగే ఎన్నికల్లో హోరాహోరీ పోరు తప్పదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# ఆగని చెరువుల ఆక్రమణలు

**రంగారెడ్డి, జూన్ :** హైదరాబాద్ మహానగరం వేగంగా విస్తరిస్తోంది. రోజురోజుకీ భవన నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. రియల్ ఎస్టేట్ రంగం దూసుకెళ్తోంది. ఈ క్రమంలో కబ్జాలు కూడా విచ్చలవిడిగా జరుగుతున్నాయి. ప్రభుత్వ భూములు మాయం అవుతున్నాయి. చెరువులు సైతం కనిపించకుండాపోతున్నాయి. కాలువలను కబ్జా చేసి, చెరువులను మాయం చేసి పెద్దపెద్ద నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ క్రమంలోనే ఎన్నో వివాదాలు నెలకొన్నాయి. వాటిలో ఎర్రకుంట చెరువు ఒకటి. బాచుపల్లిలోని సర్వే నెంబర్ 134లో ఉంటుంది ఎర్రకుంట చెరువు(లేక్ ఐడీ: 2800/ఈ/17). అయితే, ఇక్కడ మూడు నిర్మాణాలకి హెచ్‌ఎండీఏ, రెవెన్యూ అధికారుల నుంచి పర్మిషన్ రావడం వివాదాస్పదమైంది. చాలా రోజులుగా దీనిపై స్థానిక బీజేపీ నేతలు పోరాడుతున్నారు. పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మార్చి 18న సర్వే జరిగింది. డీఐ సర్వేయర్ గంగాధర్, ఏడీ శ్రీనివాస్, బాచుపల్లి ఎంఆర్ఓ రిపోర్ట్ రెడీ చేశారు. అందులో ప్రభుత్వ భూమి కబ్జా కాలేదని, అది ప్రవేట్ భూమేనని పేర్కొన్నారు. దీన్నిబట్టి ఎర్రకుంట చెరువు మొత్తాన్ని ప్రైవేట్ వ్యక్తుల చేతులకి అప్పగించే కుట్రలు జరుగుతున్నాయని బీజేపీ నేతలు మండిపడుతున్నారు. డీఐ సర్వేయర్ గంగాధర్, ఏడీ శ్రీనివాస్ తీరుపై ముందు నుంచి అనుమానాలు ఉన్నాయి. ఒక్కో కో ఆర్డినేట్‌ను దాదాపు 9 మీటర్ల మేర జరిపి కార్పొరేటర్, కొందరు బిల్డర్లకు లబ్ది చేకూర్చేలా సర్వే చేశారని అంటున్నారు. మార్చి 11 తేదీన సర్వేలో చెరువు స్థలం 3 ఎకరాలు వస్తే, 18వ తేదీ చూపించిన హద్దుల తర్వాత 2.19 ఎకరాలు మాత్రమే వచ్చిందని ఇదెలా సాధ్యమని ప్రశ్నించారు. చెరువు స్థలం ఎందుకు తగ్గింది? ఎలా తగ్గిందని అడుగుతున్నారు బీజేపీ నేతలు. ఎర్రకుంటలోని ఆక్రమణలు తొలగించే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. తప్పుల తడకగా సర్వే నిర్వహించారని ఆరోపించారు. ఎర్రకుంట చెరువును క్రమించి తప్పుడు పత్రాలలో అనుమతులు పొంది ధ్యంసం చేశారని, సరైన సర్వే చేసి కాపాడాలని డిమాండ్ చేశారు బీజేపీ నేతలు. కలెక్టర్‌కు, ఇరిగేషన్ అధికారులకు



ఫిర్యాదుల మీద ఫిర్యాదులు చేస్తే ఇప్పటికి గానీ సర్వేకు రాలేదని, తీరా సర్వే చేసి మూడు ఎకరాల ఎర్రకుంట చెరువు ప్రభుత్వ భూమి కాదని ప్రైవేట్‌దని రిపోర్ట్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఈ విధంగా సర్వే రిపోర్ట్ ఇవ్వడం వెనుక కోట్ల రూపాయలు చేతులు మారాయని ఆరోపించారు. సర్వేయర్లు దాదాపు రెండు కోట్ల ముడుపులు దండుకొని ఆక్రమణదారులకు అనుకూలంగా సర్వే రిపోర్ట్ తయారు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కలెక్టర్, హెచ్‌ఎండీఏ అధికారులు అక్రమ అనుమతులు, తప్పుడు సర్వే రిపోర్ట్‌పై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. డీఐ సర్వేయర్ గంగాధర్, ఏడీ సర్వేయర్ శ్రీనివాస్‌ను తక్షణమే సస్పెండ్ చేసి విచారణ జరిపి, ఎర్రకుంట చెరువులో అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలని, లేకపోతే అక్కడ టెంటు వేసి నిరాహార దీక్షకు దిగుతామని బీజేపీ నాయకులు, కార్పొరేషన్ సెక్రెటరీ అరుణ్ రావు, మీడియా సెల్ కో కన్వీనర్ ఉదయ్, కిసాన్ మోర్చా అధ్యక్షులు ప్రసాద్ రాజు, ఉపాధ్యక్షులు మాధవరావు, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ముఖేష్ సీనియర్ నాయకులు ఎల్లస్వామి, కాలనీవాసులు తదితరులు హెచ్చరించారు. గత తొమ్మిది సంవత్సరాల్లో బీఆర్ఎస్ నేతలు కబ్జాలకు సహకరించి, అనుమతులు ఇప్పించి ఇప్పుడు చెరువులు కాపాడాలని ఎమ్మెల్యే వివేకానంద చిలుక పలుకులు పలుకుతున్నారని, చిత్తశుద్ధి ఉంటే ఎర్రకుంటను కాపాడాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ గౌతం, హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్ ఆమ్రపాలి దీనిపై దృష్టి సారించాలని కోరారు.

# రేషన్ కార్డుల కసరత్తు



**హైదరాబాద్, జూన్ :** తెలంగాణలో కొత్త రేషన్ కార్డులు జారీపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. త్వరలోనే అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రకటన చేశారు. రేషన్ కార్డుతో ఆరోగ్యశ్రీ, పింఛన్, ఫీజు రీయింబర్స్మెంట్, ఇతర ప్రభుత్వ పథకాలు ముడిపడి ఉన్నాయి. దీంతో కొత్త రేషన్ కార్డుల కోసం అర్హులు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన కేబినెట్ భేటీలో రేషన్ కార్డుల జారీపై కీలక నిర్ణయం తీసుకున్నారు. దీంతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం అందించేందుకు కసరత్తు చేస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మూడు నెలల తర్వాత రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. దీంతో సామాన్యులకు డబ్బు ఆదా అవుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ త్వరలోనే తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కేబినెట్ భేటీలో ఈ విషయంపై చర్చించామని, విధి విధానాలు రూపొందిస్తున్నామన్నారు. రేషన్ కార్డుదారులకు 3 నెలల తర్వాత సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. ఈలోపు కొత్త రేషన్ కార్డులు కూడా జారీ చేస్తామన్నారు. సన్నవడ్లకు రూ. 500 బోనస్ ఇచ్చేందుకు మంత్రి వర్గ భేటీలో నిర్ణయం తీసుకున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను పేద, మధ్యతరగతి వారే లక్ష్యంగా అమలు చేస్తారు. సంక్షేమ పథకాల అర్హులను రేషన్ కార్డుదారుల ఆధారంగా గుర్తిస్తారు. సంక్షేమ పథకాలతో పాటు విద్యా, వైద్య సేవలకు రేషన్ కార్డు చాలా ముఖ్యం. దీంతో అర్హులు కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తుంటారు. తెలంగాణ గత కొన్నేళ్లుగా కొత్త రేషన్ కార్డులు జారీ అవ్వలేదు. దీంతో అర్హులై ఉండి కూడా చాలా మంది సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రజాపాలన ద్వారా అర్హుల నుంచి సమాచారం సేకరించిన విషయం తెలిసింది. ఇదిలా ఉంటే ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డులకు ఈ-కైవీసీ తప్పనిసరి చేసింది కేంద్రం. జూన్ 30తో ఈ కేవైసీ గడువు ముగుస్తుంది. ఇప్పటికే ఈ-కేవైసీకి గడువును చాలా సార్లు పొడగిస్తూ వచ్చింది కేంద్రం. ఈ కేవైసీ పూర్తిచేయకపోతే రేషన్ సరుకులు నిలిపివేస్తారు. సాంకేతిక కారణాల వల్ల రేషన్ కేంద్రాల్లో చాలా మంది ఈకేవైసీలో సమస్యలు వస్తున్నాయి. ఆధార్ కార్డు అప్డేట్ చేసుకోకపోవడమే ఈ సమస్యలు వస్తున్నాయని డీలర్లు చెబుతున్నారు. ఏడు నెలలుగా రాష్ట్రంలో ఈ కేవైసీ ప్రక్రియ చేపట్టినా ఇంకా 100 శాతం పూర్తి కాలేదని అధికారులు తెలిపారు. ఆధార్ సమస్యల వల్ల కేవైసీ అప్ డేట్ ఆలస్యం ఉందని, జనాలు ఆధార్ కేంద్రాలకు క్యూ కడుతున్నారు. ఆధార్ కేంద్రాలు తక్కువగా ఉండడంతో జనాలు ఈ కేంద్రాల ముందు బారులు తీరుతున్నారు.

# మల్లారెడ్డికి టీటీడీపీ బాధ్యతలు



**హైదరాబాద్, జూన్ :** తెలంగాణలో రాజకీయాల్లో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. లోక్‌సభ ఫలితాలు తర్వాత ఊహించని మార్పులు వస్తాయని నేతలు బహిరంగంగా చెప్పారు. ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఉన్న చాలా మంది నాయకులు తెలుగుదేశం పార్టీ వైపు చూస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. దాదాపు ఆరుగురు నేతలు ఇప్పటికే అధినేత చంద్రబాబుతో మంతనాలు జరిపినట్టు అందులోని సారాంశం. అదే జరిగితే కారు పార్టీ ఖాళీ కావడం ఖాయమని చర్చించుకుంటున్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత పదేళ్లపాటు పాలించింది టీఆర్ఎస్ అలియాస్ బీఆర్ఎస్ పార్టీ. అందులోని నేతలంతా దాదాపు టీడీపీ నుంచి వెళ్లినవారే. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలు తారుమారయ్యాయి. బీఆర్ఎస్ బదులు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈసారి బీఆర్ఎస్ నుంచి గెలిచినవాళ్లలో తెలుగుదేశం పార్టీ నుంచి వెళ్లినవారు ఉన్నారు. ప్రస్తుతం అధికార కాంగ్రెస్ ప్రభుత్వం దూకుడును బీఆర్ఎస్‌లోని చాలామంది నేతలు తట్టుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో సొంతగూటికి చేరుకోవాలనే ఆలోచనలో నేతలు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా మాజీ మంత్రి మల్లారెడ్డి కూడా అందులో వున్నట్లు సమాచారం. తెలంగాణ కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మల్లారెడ్డి ఆగడాలు బయటకు వచ్చాయి. ల్యాండ్ కబ్జాలు, కాలేజీలో విద్యార్థుల ధర్నాలు వంటి ఘటనలతో ఆయన కొంత బేజారు అయినట్టు తెలుస్తోంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో కాంగ్రెస్ వైపు వెళ్లకుండా టీడీపీ వైపు వెళ్తేనే బెటరని ఓ వ్యక్తి సలహా ఇచ్చారట. ఈ క్రమంలో చంద్రబాబుతో ఆయన మంతనాలు చేసినట్టు తెలుస్తోంది. అదే జరిగితే తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం రావడం ఖాయమన్నమాట. గతంలో చాలాసార్లు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పిలుపు నిచ్చారు. తమ పార్టీ నుంచి వెళ్లిన నేతలు తిరిగి రావాలని విజ్ఞప్తి చేశారు. చివరకు పలువురు నేతలకు టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే బీఆర్ఎస్ పాత్రను తెలుగుదేశం పోషించడం ఖాయమని అంటున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో బీజేపీ వైపు వెళ్లడం కరెక్ట్ కాదని, మరింత ఒత్తిళ్లు పెరుగుతాయని అంటున్నారు. ఈ ప్రచారం గురించి మాజీ మంత్రి మల్లారెడ్డి ఏమంటారో చూడాలి.

## మధ్యాహ్న భోజన పథకం కార్మికుల ధర్నా



**రాజన్న సిరిసిల్ల:** కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ కు ఇచ్చిన హామీలను డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ తెలంగాణ మధ్యాహ్న భోజనం పథకం వర్కర్స్ యూనియన్ మరియు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్ళతోపాటు పదివేల రూపాయల వేతనాలు చెల్లించాలని,ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి మధ్యాహ్న భోజ కార్మికులను శ్రమదోపిడి చేస్తున్నారని ఉద్యోగ భద్రత పని భద్రత లేకుండా చేస్తున్నారని, కార్మికుల యొక్క న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు వచ్చేనెల ఐదో తారీకు సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు

## 5 కిలోమీటర్ల మేర నిలిచిపోయిన వాహనాలు



**విజయవాడ:** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేడు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.. ప్రమాణ స్వీకారం మహోత్సవానికి రాష్ట్రవ్యాప్తంగా టిడిపి జనసేన బిజెపి కార్యకర్తలు పెద్దఎత్తున హాజరవుతున్నారు.. ఈ కరణంగా గుంటూరు జిల్లా మంగళగిరి సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న కాజా టోల్గేట్ వద్ద రాయలసీమ నుంచి వస్తున్న వాహనాలతో ట్రాఫిక్ నిలిచిపోయింది

## మున్నేరు రిటర్నింగ్ వాల్ పనులను పరిశీలించిన మంత్రి పొంగులేటి



**ఖమ్మం:** ఖమ్మం జిల్లా దానవాయిగూడెంలో మున్నేరు రిటర్నింగ్ వాల్ నిర్మాణ పనులను తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మంత్రి మాట్లాడుతూ - యుద్ధప్రాతిపదికన పనులను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ప్రతిభావంతులైన వర్కర్లను నియమించి పనుల్లో లోపాలు తలెత్తకుండా చూడాలి. ఇప్పటికే నాలుగు నెలల సమయం వృధా అయింది...ఫుల్ టైం నిర్మాణ పనులను చేపట్టి త్వరగా పూర్తి చేయండి. పదిరోజుల్లో మళ్ళీ వస్తా... పనుల్లో పురోభివృద్ధి లేకపోతే బాధ్యుల పై చర్యలు.... పనుల్లో నాణ్యత లోపించిన ఊరుకునేది లేదు. రెవెన్యూ అధికారులు మున్నేరు కు ఇరువైపులా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి ఇరిగేషన్ అధికారులకు అప్పగించండి. గోళ్ళపాడు సైడ్ డ్రైన్ల మాదిరిగా మున్నేరు సైడ్ డ్రైన్ లను నిర్మించండి. స్టార్టింగ్ పాయింట్... ఎండింగ్ పాయింట్ లను గుర్తించి సైడ్ డ్రైన్ ల నిర్మాణ పనులను చేపట్టాలి... తద్వారా మురికి నీరు మున్నేరు లో చేరకుండా ఉంటుందని అన్నారు.

## స్కూలు బస్సులపై ఆర్టీయే తనిఖీలె




**రంగారెడ్డి:** నగర శివారు రాజేంద్రనగర్ లో స్కూల్ బస్సు ల పై ఆర్టీయే అధికారులు సోదాలు నిర్వహించారు. బుధవారం నుండి పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థులను రవాణా చేసే స్కూల్ బస్సు లపై ఫోకస్ పెట్టారు. ఫిట్నెస్, ఇన్సూరెన్స్, పర్మిట్, డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్, ఫయర్ సేఫ్టీ కిట్, ఫస్ట్ ఎయిడ్ కిట్స్ లను క్షణంగా రవాణా అధికారులు తనిఖీలు చేసారు. పలు బస్సులురంగారెడ్డి జిల్లా రవాణా శాఖ అధికారులు సీజ్ చేసారు. రాజేంద్రనగర్, శంషాబాద్, మొయినాబాద్, శేరిలింగంపల్లి తో పాటు పలు చోట్ల విసృత సోదాలు నిర్వహించారు.

# మంత్రులకు బుల్లెట్ ప్రూఫ్ ల్యాండ్ క్రూయిజర్



**హైదరాబాద్, జూన్ :** తెలంగాణ మంత్రులకు కొత్త శోభ వచ్చింది. మంత్రులు ప్రయాణించే వాహన కాన్వాయ్ లో అత్యాధునికమైన బుల్లెట్ ప్రూఫ్ ల్యాండ్ క్రూయిజర్ వాహనం చేరిపోయింది.ఇప్పటివరకు ముఖ్యమంత్రి కాన్వాయ్కే పరిమితమైన ఈ వాహనం ఇప్పుడు అందరి మంత్రుల కాన్వాయ్లో చేర్చారు. సుమారు రెండు కోట్ల వ్యయంతో అత్యాధునికమైన ల్యాండ్ క్రూయిజర్ల వాహనాలను ఈరోజు మంత్రుల కాన్వాయ్ లో చేర్చింది ప్రోటోకాల్ డిపార్ట్మెంట్.గత బీఆర్ఎస్ ప్రభుత్వం 22 ల్యాండ్ క్రూయిజర్లను తయారు చేసి పెట్టిన విషయం తెలిసిందే. అయితే ఆ వాహనాలన్నీ నలుపు రంగులో ఉండే విధంగా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్లాన్ చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వాటన్నిటిని రాష్ట్రానికి తెప్పించి ఆధునీకరించారు. ల్యాండ్ క్రూజర్ల అన్నింటినీ బుల్లెట్ ప్రూఫ్ వాహనాలుగా మార్చి ప్రతి మంత్రికి ఒకటి ఇవ్వాలని నిర్ణయించారు.ఈ మేరకు జీఏడీ ప్రోటోకాల్ నేటి నుంచి ప్రతి మంత్రి కాన్వాయ్ లో ల్యాండ్ క్రూయిజర్ ను ఏర్పాటు చేసింది. దీంతో రాష్ట్ర మంత్రులు పరిపాలన వేగవంతం పెంచేందుకు ప్రజలకు వద్దకు,నియోజకవర్గం వెళ్లేందుకు ఉపయోగపడుతుందని అంటున్నారు మంత్రులు.కొత్త వాటిని కొనకుండా గత ప్రభుత్వం వెచ్చించిన వాహనాలనే వినియోగించుకుంటున్నామని ఆర్థిక క్రమశిక్షణతో ప్రభుత్వం ముందుకు పోతుందని చెబుతున్నారు ప్రభుత్వ పెద్దలు.

# తెలంగాణలో కొత్త మద్యం

**హైదరాబాద్, జూన్ :** తెలంగాణలో కొత్త మద్యం బ్రాండ్లు రాబోతున్నాయన్న వార్తతో మందుబాబులు హర్షం వ్యక్తం చేశారు. కానీ.. ఆయా బ్రాండ్లపై నిరసనగా సోషల్ మీడియాలో మీమ్ లు రావడంతో.. వాటిని తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలుస్తోంది. మద్యం ప్రియుల నుంచే కొత్త బ్రాండ్లపై వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో ప్రభుత్వం వెనక్కి తగ్గినట్లు సమాచారం. బేవరేజెస్ కార్పొరేషన్ 5 కొత్త మద్యం కంపెనీలకు ఇచ్చిన లైసెన్సులను తాత్కాలికంగా నిలిపివేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.కొత్తగా వచ్చే బీర్ బ్రాండ్లపై నెటిజన్ల నుంచి, మందుబాబుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. మీమ్ లతో సోషల్ మీడియాలో పెద్దఎత్తున చర్చ జరగడంతో.. కొత్తకంపెనీలకు ఇవ్వాల్సిన అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా ఆపివేసినట్లు సమాచారం. రాష్ట్రం కొత్త బీర్లను సరఫరా చేసేందుకై బేవరేజెస్ కార్పొరేషన్ 5 కొత్త కంపెనీలకు అనుమతులిచ్చింది. ఈ 5 కంపెనీలు 27 రకాల బీర్లను ప్రవేశపెట్టేందుకు సిద్ధమయ్యాయి. అయితే.. లైసెన్సులు పొందిన కంపెనీలు సరైన నేపథ్యం లేకపోవడంతో పాటు కల్తీ మద్యాన్ని అమ్ముతున్నట్లుగా కథనాలు రావడంతో వ్యతిరేకత వ్యక్తమైంది.ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఆయా కంపెనీల ప్రతినిధులతో వాటికిచ్చిన అనుమతుల్ని నిలిపివేసినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. రాష్ట్రంలోకి కొత్త మద్యం బ్రాండ్లను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్న



ప్రచారాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు ఖండించారు. కొత్త బ్రాండ్ల కోసం ఎవరూ దరఖాస్తు చేసుకోలేదన్న ఆయన .. గత ప్రభుత్వమే అనేక శాఖల్లో బిల్లుల్ని పెండింగ్ లో ఉంచిందన్నారు. ఆ బిల్లులు పెండింగ్ లో ఉండటం వల్లే కంపెనీలు బీర్ల సరఫరా ఆపి ఉండొచ్చని.. అంతే తప్ప కృత్రిమ కొరత మాత్రం లేదన్నారు.ఇదిలా ఉండగా.. తెలంగాణలో మద్యం ధరలను పెంచాలని కాంగ్రెస్ ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక స్పిరిట్ ధరలను పెంచడం తొలిసారి అయితే.. గడిచిన ఐదేళ్లలో ఇది మూడోసారి. బీఆర్ఎస్ హయాంలో 2022లో బీర్, ఫారిన్ లిక్కర్ ధరలను పెంచింది. అంతకుముందు మే 2020, కోవిడ్ ? 19 లాక్ డౌన్ సమయంలో కేసీఆర్ సర్కార్ మద్యం రేట్లను పెంచింది.

# కులగణన దిశగా అడుగులు




**వరంగల్, జూన్ :** తెలంగాణలో దశాబ్దాలుగా డిమాండ్ చేస్తూ వస్తున్న కులగణనపై కసరత్తు ప్రారంభమయింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ ఇతర సామాజిక వర్గాలకు సంబంధించిన కుల సర్వే చేయడానికి గతంలోనే అసెంబ్లీలో అమోదం లభించింది. ఈలోగా ఎన్నికల కోడ్, పార్లమెంట్ ఎన్నికల హడావిడితో కులగణన అంశం పెండింగ్ లో ఉండిపోయింది. అయితే రాష్ట్రంలో చేపట్టబోయే కులగణనకు దాదాపు అన్ని పార్టీలు సుముఖంగానే ఉన్నాయి. కేంద్రంలో బీజేపీ సర్కార్ అంత సానుకూలంగా లేకపోయినా తెలంగాణలో రాష్ట్ర నేతలు మాత్రం కులగణనకు మద్దతు తెలుపుతునే ఉన్నారు. ఈ మేరకు కులసర్వే విధివిధానాల అమలు పద్దతులు, ప్రశ్నావళి రూపకల్పన తధితర పద్ధతులపై బీసీ కమిషన్ చర్యలు మొదలుపెట్టింది. ఇటీవల జరిగిన సమావేశంలో బీసీ కమిషన్ సభ్యులతో పీపుల్స్ కమిటీ భేటీ అయింది. కులగణనపై ఏ రకంగా ముందుకు వెళ్లాలనే అంశంపై చర్చ జరిపారు. స్థానిక ఎన్నికలు జరిగే లోపే రాష్ట్రంలో కులగణన ప్రక్రియ పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తోంది.అసలు ఈ కులగణన ఏమిటి? దీని వలన వచ్చే లాభం ఏమిటి? దాని ఆవశ్యకత ఏమిటి అని చాలా మందికి సందేహాలున్నాయి. భారత దేశంలో మొట్టమొదటిసారి 1931లో బ్రిటీష్ కాలంలోనే కులగణన జరిగింది. అప్పటికి పాకిస్తాన్, బంగ్లాదేశ్ దేశాలు కూడా భారత్ లోనే కలిసివున్నాయి. ఆ తర్వాత ఇప్పటిదాకా ఏ ప్రభుత్వం కూడా కులగణన అంశాన్ని సీరియస్ గా తీసుకోలేదు. పైగా 1941 జనాభా లెక్కల నుంచి ఈ కేటగిరీనే తీసివేశారు. చదువు, ఉద్యోగాల కోసం దరఖాస్తులలో కులం కేటగిరీని చేర్చారు. కేవలం ఆ లెక్కల ఆధారంగానే ఇప్పటిదాకా ఇంత మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, తదితరులు ఉన్నారని లెక్కలు వేస్తూ వస్తున్నారు. వీటి ఆధారంగానే ప్రభుత్వ సంక్షేమ పథకాలు సైతం అమలుచేస్తూ వస్తున్నారు. అయితే ఇవన్నీ అధికారిక లెక్కల కిందకి రావు. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 2011-12లో సామాజిక, ఆర్థిక, కులగణన చేపట్టింది నాటి కాంగ్రెస్ ప్రభుత్వం. అయితే ఆ లెక్కలేవీ ఇప్పటిదాకా బయటకు రాకపోవడం గమనార్హం.సాధారణంగా జనాభా లెక్కల్లో కేవలం ఎస్సీ, ఎస్టీ జనాభాను మాత్రమే లెక్కలేస్తారు. కానీ అన్ని సామాజిక వర్గాల జీవన స్థితిగతులు ముఖ్యంగా ఆర్థిక, ఉపాధి, ఉద్యోగ, వ్యవసాయ, సంఘటిత, అసంఘటిత వ్యాపార రంగాలను కూడా ప్రాతిపదికన తీసుకోవాలి. అలా జరిగినప్పుడే అన్ని వర్గాలకు లబ్ధి చేకూరే అవకాశం కలుగుతుంది. మనదేశంలో జనాభా లెక్కలు మొదలైన కొత్తలో ఎక్కువమంది ప్రజలు వ్యవసాయం, కుటీర పరిశ్రమలు, కులవృత్తులు, చిరువ్యాపారాలు, కూలీపనులు చేస్తూ బతికేవాళ్లు. కానీ.. స్వాతంత్రం వచ్చాక ఆధునిక పరిశ్రమలు, సేవారంగం విస్తరించాయి. అనాదిగా ఉన్న అనేక వృత్తులు అదృశ్యమైపోతున్నాయి. చిరువ్యాపారులు తమ అవకాశాలు కోల్పోతున్నారు. కార్పొరేట్ వ్యాపార సంస్థల వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమై పోయిన విషయం స్పష్టంగా కనిపిస్తోంది.నూతన ఆర్థిక విధానాల వల్ల ఆర్థిక అసమానతలు అనేక రెట్లు పెరిగాయని అనేక జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా సంస్థలు చెప్తున్నాయి. కాబట్టి ఇప్పటి పరిస్థితులు ఎలా ఉన్నాయనేది తెసుకోవాల్సిన, అన్ని కులాల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, ఉపాధి, ఉద్యోగ పరిస్థితులపై ఒక సమగ్ర అంచనా వేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏ టెక్నాలజీ, సరైన ప్రభుత్వం, అధికార యంత్రాంగం లేని టైం1881లోనే కులగణన జరిగింది. అలాంటిది ఇప్పుడు పటిష్టమైన ప్రభుత్వాలు, అధికారులు, టెక్నాలజీ సపోర్ట్గా ఉండగా ఇప్పుడు కులగణన చేయడం అంత పెద్ద కష్టమేమీ కాదు. ఇప్పటికే బీహార్, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో కులగణన చేశారు. కానీ.. వాటికి ఆ ప్రభుత్వాలు పెట్టిన పేర్లే వేరు. రాష్ట్రాలకు తగిన అధికారం లేకపోవడం వల్ల సర్వే పేరుతో కులగణన చేస్తున్నారు. కాకపోతే.. వీటిలో తెలంగాణతోపాటు మరికొన్ని రాష్ట్రాలు ఆ డాటాను బయటపెట్టలేదు.

# మెరుగైన ఫలితాలు రావాలి

**హైదరాబాద్:** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు స్ఫూర్తివంతమైన ఫలితాలు ఇస్తున్నారని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి అన్నారు. బుధవారం నాడు బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు యూనిఫామ్స్, నోట్ బుక్స్ ను తార్నాక డివిజన్ లోని జమా ఈ ఉస్మానియా ఓయూ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పంపిణీ చేసారు. శ్రీలత మాట్లాడుతూ పాఠశాలలో శానిటేషన్ మరియు టాయిలెట్ పరిశుభ్రత కోసం జీహెచ్ఎంసి పారిశుద్ధ కార్మికులతో ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తూ విద్యార్థులకు చదువుకోవడానికి మంచి వాతావరణం కలిగేలా చూస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులే ఈరోజు వివిధ రంగాల్లో గొప్ప స్థాయిలో ఉంటూ దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు కూడా బంగారు భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు. ఓయూ పరిధిలో ఉన్న తొమ్మిది బస్తీల్లో నివసిస్తున్న ఇంకా మరేంతో మంది పేద విద్యార్థులకు



ఈ పాఠశాల ద్వారా నాణ్యమైన విద్యనందిచాలని, మెరుగైన ఫలితాలు రావాలని కోరారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, స్థానిక నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇక అందరికి బయోమెట్రిక్




**హైదరాబాద్, జూన్ :** ప్రభుత్వ కార్యాలయాలలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇక క్రమశిక్షణ పద్ధతులు అమలుచేయనున్నారా? సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారా? అవును నిజమే రాష్ట్రవ్యాప్తంగా ఇకపై అన్ని గవర్నమెంట్ ఆఫీసుల్లో బయోమెట్రిక్ హాజరును అమలుచేయాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారని సమాచారం. సచివాలయం సిబ్బంది ప్రతిరోజూ కార్యాలయం లోపలకి, బయటకు వెళ్లేటప్పుడు బయోమెట్రిక్ పంచ్ తప్పనిసరిగా చేయాలనే యోచనలో రేవంత్ సర్కార్ ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలలో చర్చ జరుగుతోంది. అయితే ఈ పంచింగ్ సిస్టమ్ సీఎం కూ వర్తిస్తుందని సీఎం టూ అటెండర్ వరకూ తప్పనిసరిగా బయోమెట్రిక్ థంబ్ నైల్ ఉండబోతోందని సమాచారం.ఉద్యోగుల్లో క్రమశిక్షణ, జవాబుదారీతనం పెంచేందుకు బయోమెట్రిక్ హాజరును తప్పనిసరి చేయాలని సీఎం యోచిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రభుత్వ ఉద్యోగులపై వచ్చిన విమర్శలను సీఎం సీరియస్గా తీసుకున్న సంగతి తెలిసిందే. దీంతో ముందుగా సచివాలయంలో బయోమెట్రిక్ హాజరు అమలు చేయాలని సీఎస్ శాంతికుమారికి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ప్రతి ఒక్కరికీ బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేయాలని యోచిస్తున్నామన్నారు.ఫలితంగా మంత్రులు, ఐఏఎస్లు, సచివాలయ ఉద్యోగులకు కూడా పంచ్లు చేయాల్సి ఉంటుందని సీఎం తన సన్నిహితులతో అన్నట్లు సమాచారం. సీఎం, సీఎస్, మంత్రులందరూ బయోమెట్రిక్ హాజరును పాటిస్తున్నందున కిందిస్థాయి ఉద్యోగుల విమర్శలకు ఆస్కారం ఉండదని సీఎం భావిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వ కార్యాలయాల్లో బయోమెట్రిక్ హాజరును తప్పనిసరి చేయాలని సీఎం కోరుతున్న సంగతి తెలిసిందే. కార్యాలయానికి వచ్చినప్పుడు, ఇంటికి వెళ్లేటప్పుడు కూడా పంచ్లు వేస్తే ప్రభుత్వ ఉద్యోగులపై ప్రజల్లో ఉన్న ప్రతికూల అభిప్రాయం తొలగిపోతుందని సీఎం అభిప్రాయపడినట్లు సమాచారం.త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్యాలయాల్లో బయోమెట్రిక్ హాజరును అమలు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించడం చర్చనీయాంశమవుతోంది. బయోమెట్రిక్ వల్ల ఉద్యోగులపై నిఘా, పనుల్లో వేగం పెంచడంతోపాటు ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించే అవకాశం ఉందని సీనియర్ ఐఏఎస్ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. అయితే మొదట్లో ఉద్యోగుల నుంచి విమర్శలు వచ్చినా.. చివరికి ప్రజల నుంచి ప్రశంసలు వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

## విమర్శించిన వారికి ఓటు ద్వారా గుణపాఠం చెప్పారు

### - కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



**హైదరాబాద్:** హైదరాబాద్: అంబర్‌పేట నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి పనులూ చేపట్టలేదని విమర్శలు చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలకు ప్రజలు ఓటు ద్వారా సరైన గుణపాఠం చెప్పారని కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. ఢిల్లీలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు, మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌గౌడ్, కోశాధికారి ఏ. సూర్యప్రకా?షసింగ్, అధికార ప్రతినిధి ఏడెల్లి అజయ్‌కుమార్, బీజేపీ రాష్ట్ర నాయకులు ఎక్కాల నందు, ఎక్కాల కన్నా తదితరులు కలిసి శాలువా, పూలబోకేతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ అంబర్‌పేట ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని, ఈ నియోజకవర్గ ప్రజలు అందించిన మెజారిటీతోనే ఎంపీగా, కేంద్ర మంత్రిగా రెండోసారి గెలిచి పార్లమెంట్‌లో అడుగుపెట్టబోతున్నానని అన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు ప్రారంభం



**భువనగిరి:** తెలంగాణలో బుధవారం నుంచి పాఠశాలలు ప్రారంభం అయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా 700కు పైగా ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం అయ్యాయి. ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే 3,000కు పైగా ఉంది ఉపాధ్యాయులు విధులకు హాజరు అవుతున్నారు. ప్రాథమిక పాఠశాలలు ఉదయం 9 గంటలకు ప్రాథమికోన్నత పాఠశాలలు ఉదయం 9:15 నిమిషాలకు ప్రారంభమయ్యాయి. బడి గంట మోగడంతో విద్యార్థులు పాఠశాలలకు పయనమయ్యారు. విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా ఏడు మోడల్ స్కూలు 11 కస్తూర్బా పాఠశాలలు ఉన్నాయి.




## దసరా రేసు నుంచి తప్పుకున్న 'ఓజీ'..

# 'దేవర' కొత్త రిలీజ్ డేట్ ఇదే..!





యంగ్ టైగర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'దేవర'. జనతా గ్యారేజ్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా రానుండటంతో భారీ అంచనాలు ఉన్నాయి. ఇక రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తుండగా, సైఫ్అలీఖాన్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. విస్మరణకు గురైన ఓ తీర ప్రాంతం నేపథ్యంలో హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్టైనర్గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. అయితే ఈ సినిమాను దసరా కానుకగా అక్టోబర్ 10న విడుదల చేయనున్నట్లు మేకర్స్ మొదట ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే అదేరోజు తమిళం నుంచి రజనీ కాంత్ వేటగాడు వస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. దీంతో ఈ సినిమాను రెండు వారాలు ముందుగానే తీసుకోస్తున్నట్లు వార్తలు వైరల్ అయ్యాయి. అయితే ఈ వార్తలను నిజం చేస్తూ.. దేవర టీం కొత్త విడుదల తేదీని ప్రకటించింది. ఈ సినిమాను సెప్టెంబర్ 27న విడుదల చేయనున్నట్లు కొత్త పోస్టర్ను విడుదల చేసింది. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై సుధాకర్, హరికృష్ణ కె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ స్వరకర్త. మరోవైపు అదేరోజున పవన్ కళ్యాణ్ ఓజీ విడుదల అవుతున్నట్లు మేకర్స్ ప్రకటించగా తాజాగా ఈ చిత్రం వాయిదా పడినట్లు తెలుస్తుంది.

## నటుడు పృథ్వీరాజ్కు నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్



తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన హాస్య నటుడు, థర్టీ ఇయర్ ఇండస్ట్రీగా గుర్తింపు తెచ్చుకున్న పృథ్వీరాజ్కు కోర్టు నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్ను జారీ చేసింది. విజయవాడ స్థానిక ఫ్యామిలీ కోర్టు అతడికి నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేసింది. మనోవర్తి చెల్లించాలంటూ పృథ్వీ భార్య బలిరెడ్డి శ్రీలక్ష్మి అతడిపై ఫ్యామిలీ కోర్టులో వేసిన కేసులో ఈ పరిణామం చోటుచేసుకుంది. భార్య బలిరెడ్డి శ్రీలక్ష్మికి నెలకు రూ.8 లక్షలు చెల్లించాలని ఫ్యామిలీ కోర్టు గతంలో ఆదేశాలు ఇచ్చింది. అయితే ఈ ఆదేశాలను పాటించని పృథ్వీ హైకోర్టులో సవాలు చేశారు. కేసును పరిశీలించిన న్యాయస్థానం తాత్కాలిక ఉపశమనం కల్పిస్తూ భార్యకు నెలకు రూ.22వేల చొప్పున చెల్లించాలని ఆదేశించింది. అప్పటి వరకు ఉన్న బకాయిలు మొత్తం చెల్లించాలని స్పష్టం చేసింది. అయితే పృథ్వీరాజ్ హైకోర్టు ఆదేశాలను కూడా ఖాతరు చేయలేదు. దీంతో భార్య శ్రీలక్ష్మి తన న్యాయవాదులు సుంకర రాజేంద్రప్రసాద్, సప్పా రమేష్, సీహెచ్ వడ్డీకాసులును సంప్రదించి ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ వేశారు. పృథ్వీరాజ్ కోర్టుకు హాజరుకాకుండా కేసు వివరాలను ఒక దినపత్రికలో ప్రకటన చేశారని, కోర్టుకు హాజరుకావడం లేదని లాయర్లు పిటిషన్లో వివరించారు. ఫ్యామిలీ కోర్టు జడ్జి బుధవారం పిటిషన్ను పరిశీలించారు. పృథ్వీరాజ్కు నాన్బెయిలబుల్ అరెస్ట్ వారెంటు జారీ చేశారు. దీంతో పృథ్వీరాజ్ చిక్కుల్లో పడ్డట్టు అయింది.

# 'సరిపోదా శనివారం' నుంచి ఫస్ట్ సింగిల్ ప్రోమో రిలీజ్




'హాయ్ నాన్న' వంటి సూపర్ హిట్ తర్వాత స్టార్ హీరో నాని నటిస్తున్న చిత్రం 'సరిపోదా శనివారం'. నాని 31గా వస్తున్న ఈ సినిమాకు వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్నాడు. నాని సరసన ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్?గా నటిస్తుండగా.. ఎస్?జే సూర్య కీలక పాత్రలో నటిస్తున్నాడు. డివివి ఎంటర్టైన్మెంట్స్పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి హై బడ్జెట్, భారీ కాన్వాస్తో ఈ సినిమా తెరకెక్కుతుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్తో పాటు గ్లింప్స్ విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇదిలావుంటే తాజాగా మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. చెప్పినట్లుగానే ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ ప్రోమోను చిత్రయూనిట్ విడుదల చేసింది. గరం గరం యముడయో అంటూ సాగిన ఈ పాట ఫుల్ మాస్ బీట్గా ఉండబోతున్నట్లు తెలుస్తుంది. ఫుల్ సాంగ్ను జూన్ 15 శనివారం రోజున విడుదల చేయనున్నట్లు తెలిపారు. యూనిక్ యాక్షన్ ఎంటర్టైనర్గా వస్తోన్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ మ్యూజిక్, బ్యాక్గ్రౌండ్ స్కోర్ అందిస్తుండగా.. సాయికుమార్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఇక 'అంటే సుందరానికి' సినిమా తర్వాత నాని %-% వివేక్ కాంబో రిపీట్ అవుతుండడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా ఆగష్టు 29న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# ఇక స్థానిక సంస్థలపై గురి




**విశాఖపట్టణం, జూన్ :** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కనీవిని ఎరుగని విజయాన్ని సాధించిన టీడీపీ కూటమి ఇక స్థానిక సంస్థలపై పట్టు సాధించే ప్రయత్నాలు చేయొచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. మూడేళ్ల క్రితం ఏపీలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్ని ఏకగ్రీవం చేయడంపై పలు ఆరోపణలు వచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, జడ్పీ పీఠాలను దక్కించుకునే క్రమంలో వైసీపీ అక్రమాలకు పాల్పడిందని అప్పట్లో టీడీపీ ఆరోపించింది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రభుత్వానికి ఘర్షణ తలెత్తింది. ఎన్నికల్ని వాయిదా వేసే విషయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌తో ప్రభుత్వం కయ్యానికి కాలు దువ్వింది. ఆ తర్వాత రకరకాల పరిణామాలు జరిగాయి. కోవిడ్ రెండో దశలో ఉండగా ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల్ని నిర్వహించారు. నాటి ఎన్నికల్లో ప్రధాన కార్పొరేషన్లతో పాటు గ్రేడ్ వన్ మునిసిపాలిటీలు, స్థానిక సంస్థలు, జడ్పీ పీఠాలను వైసీపీ దక్కించుకుంది. టీడీపీ పోటీ చేసిన స్థానాల్లో అభ్యర్థుల్ని అడ్డుకోడానికి అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆ పార్టీ ఆరోపించింది. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో టీడీపీ క్యాడర్ మొత్తం చెల్లాచెదురై పోయింది. స్థానికంగా పట్టున్న వాటిని కూడా నిలుపుకోలేక పోయింది. ఈ క్రమంలో 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పాలైంది. వైసీపీ పరాజయంలో ఆ పార్టీ తరపున స్థానిక సంస్థలకు ప్రాతినిధ్యం వహించిన ప్రజా ప్రతినిధులు కీలక పాత్ర పోషించారు. అధికారం ఉందని చెలరేగిపోయారు. రాష్ట్రంలో ఎక్కడికక్కడ ప్రజల్ని పీల్చుకుతిన్నారు. పట్టణాల్లో అయితే భవన నిర్మాణాలకు అనుమతి మొదలుకుని, చిన్న చితక పనులు వరకు ఎక్కడ వీలైతే అక్కడ దోచేశారు. వైసీపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పోగవడానికి ప్రజా ప్రతినిధులే కీలక పాత్ర పోషించారు. ఎన్నికల ఫలితాలతో ఒక్కసారిగా పరిస్థితి తారుమారు కావడంతో స్థానిక సంస్థలకు సారథ్యం వహిస్తున్న నాయకులు పక్క చూపులు మొదలు పెట్టారు. మరో రెండేళ్ల పదవీ కాలాన్ని కాపాడుకోవాలంటే అధికార పార్టీలో చేరిపోవడం మేలని భావిస్తున్నారు. స్థానికంగా లభించే ఆదాయాన్ని వదులుకోకూడదంటే అధికార పార్టీని ఆశ్రయించడం మేలని భావిస్తున్నారు. వైసీపీ ఇప్పట్లో పూర్తి స్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించే పరిస్థితి లేదని చాలామంది నేతల్లో ఉంది. ప్రస్తుతం పదవుల్లో ఉన్న మేయర్లు, జడ్పీ ఛైర్మన్లు మొదలుకుని కార్పొరేటర్లు, జడ్పీటీసీ సభ్యుల వరకు వీలైనంత త్వరగా అధికార పార్టీలో చేరిపోడానికి రెడీ అవుతున్నారు. ఒంగోలు, నెల్లూరు వంటి నగరాల్లో ఇప్పటికే అలజడి మొదలైంది. సోమవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డితో కార్పొరేటర్లు భేటీ అయ్యారు. ప్రకాశం జిల్లాలో ఏకైక కార్పొరేషన్‌గా ఉన్న ఒంగోలులో గత ఎన్నికల్లో వైసీపీ గెలిచింది. మొత్తం 50 డివిజన్లలో 43 స్థానాలను వైసీపీ గెలుచుకుంది. ఆరు డివిజన్లలో టీడీపీ, ఒకచోట జనసేన అభ్యర్థులు గెలిచారు. ఎన్నికల పోలింగ్‌కు ముందే వైసీపీకి చెందిన ఐదుగురు కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. దీంతో టీడీపీ బలం 11కి చేరింది. ఒంగోలు కార్పొరేషన్ మేయర్ గంగాడ సుజాత ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి టీడీపీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నారు. వైసీపీ కార్పొరేటర్లతో ఆదివారం మేయర్ తన ఇంట్లో సమావేశమయ్యారు. ప్రస్తుతం వైసీపీకి 39మంది కార్పొరేటర్లు ఉండగా సుమారు 27మంది ఆమెతో సమావేశమయ్యారు. 13 మంది గైర్హాజరయ్యారు. కార్పొరేటర్లలో ఎక్కువమంది తమ డిమాండ్లు నెరవేరిస్తే వైసీపీని వీడేందుకు సిద్ధమయ్యారు. నెల్లూరు, ప్రకాశంతో పాటు రాష్ట్రంలోని అన్ని స?థానిక పీఠాలను వీలైనంత త్వరగా టీడీపీ దక్కించుకునే అవకాశాలు లేకపోలేదు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం కంటే చట్టపరంగానే వారిని పదవుల నుంచి తొలగించడానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నారు. మరోవైపు వైసీపీ ఓటమిలో కీలక పాత్ర పోషించి, ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకున్న వారిని ఇప్పుడు టీడీపీలో చేర్చుకుంటే ఆ ప్రభావం పార్టీపై ఎంత మేరకు ఉంటుందనే చర్చ కూడా నడుస్తోంది. చాలా నగరాల్లో మేయర్లుగా మహిళలు ఉన్నా వారి భర్తల పెత్తనం కార్పొరేషన్లలో సాగుతోంది. ప్రతి నెల కాంట్రాక్టులు, ముడుపుల రూపంలో కోట్లాది రుపాయలు వసూలు చేస్తున్నారు. వైసీపీని నిండా ముంచిన అవినీతి నేతల్ని టీడీపీలో చేర్చుకోవడంపై అప్రమత్తంగా ఉండాలనే సూచనలు కూడా వినిపిస్తున్నాయి.

# మరి జనసేన సీఎం ఎప్పుడు

**కాకినాడ, జూన్ :** ఇంతకు ముందు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమాలతో మంచి గుర్తింపును సంపాదించుకున్నాడు. ఇక ఇప్పుడు మాత్రం రాజకీయంగా కూడా తనకంటూ మంచి పేరు ప్రఖ్యాతలను ఏర్పాటు చేసుకున్నాడు. ఇక మొత్తానికైతే ఆయన పిఠాపురం ఎమ్మెల్యేగా కొనసాగడమే కాకుండా ఈసారి ఎన్డీఏ కూటమి గవర్నమెంట్ ను ఫామ్ చేయడంలో తను కీలకపాత్ర వహించాడు. ఇక 2019 ఎలక్షన్స్ లో ఒకే ఒక్క సీట్ ని గెలిచిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు మాత్రం 21 ఎమ్మెల్యే స్థానాలను, రెండు ఎంపీ స్థానాలను గెలిచి తన స్టామినా ఏంటో ప్రూవ్ చేసుకున్నాడు. ఇక మొత్తానికైతే చంద్ర బాబు నాయుడుని సీఎం కుర్చీలో కూర్చోబెట్టాడు. ఇక ఇది చూసిన చాలామంది పవన్ కళ్యాణ్ ఎప్పుడు సీఎం అవుతాడు అంటూ పలు రకాల అభిప్రాయాలనైతే వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ పవన్ కళ్యాణ్ 2029 లో పక్కాగా సీఎం కుర్చీని దక్కించుకుంటాడు అనేది మాత్రం చాలా స్పష్టంగా తెలుస్తుంది. ఎందుకంటే ఇప్పటికే జగన్ అరాచక పాలనని రాష్ట్రం నుంచి పోగొట్టలనే ఉద్దేశ్యం తోనే తను తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకున్నాడు. ఇప్పుడు పవన్ కళ్యాణ్ ఒంటరి గా పోటీ చేసి ఉంటే మళ్ళీ జగన్ ప్రభుత్వమే వచ్చేది. అందుకే పవన్ కళ్యాణ్ ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదనే ఉద్దేశ్యం తోనే పొత్తు పెట్టుకున్నాడు. ఇక జగన్ సీఎం పదవి నుంచి తప్పుకుంటేనే రాష్ట్రం బాగుంటుందని



ఆయనను తప్పించి చంద్రబాబు ను సీఎం చేసే కార్యక్రమాన్ని చేపట్టాడు. ఇక మొత్తానికైతే వచ్చే ఎలక్షన్స్ లో పవన్ కళ్యాణ్ తన పార్టీ పలుకుబడిని మరింతగా పెంచుకొని సీఎం అవ్వడానికి రెడీగా ఉంటాడు. అప్పటివరకు తెలుగుదేశం పార్టీ నుంచి చంద్రబాబు నాయుడు కూడా అంత యాక్టివ్ గా ఉండలేరు. కాబట్టి పవన్ కళ్యాణ్ కి సీఎంగా మారే అవకాశాలైతే ఉన్నాయి. అందుకోసమే ఆయన ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు తనే అని గట్టిగా నమ్ముతున్నాడు. ఇక ఆ కారణం గానే తను ఈ ఐదు ఏళ్ల లో మంచి పనులు చేసి జనం మెప్పు పొందాలని చూస్తున్నాడు. ఇక ఆంధ్రప్రదేశ్ జనాలు కూడా పవన్ కళ్యాణ్ ఒకసారి సీఎం అయితే చూడాలి అని అనుకుంటున్నారు?

# కారు బోల్తా.. భార్యాభర్తలకు తీవ్ర గాయాలు



**చిత్తూరు:** డ్రైవర్ నిద్రపోవడంతో కారు బోల్తా పడి భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. నంద్యాల జిల్లా, ఆళ్లగడ్డ కు చెందిన దంపతులు కుమారస్వామి రాజు(62) భార్య జయలక్ష్మి(56) సొంత పనిపై బాడుగ కారులో బెంగుళూరుకు బయలుదేరారు. మార్గ మధ్యంలోని తంబళ్లపల్లె నియోజకవర్గం, కురబలకోట మండలం, ముదివేడు గురుకుల పాఠశాల వద్దకు రాగానే, డ్రైవర్ రాజు నిద్రపోవడంతో కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్పంగ్ గాయపడగా, దంపతులు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. 108 సిబ్బంది మనోహర్ తదితరులు బాధితులను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. ప్రాణాపాయం తప్పి కోలుకుంటున్నట్లు తెలిపారు

# ఎంఆర్ సి భవనం నుండి ఎంపిపి కార్యాలయాన్ని ఖాళీ చేయండి

- తహశీల్దార్ కు, ఎంపిడివో లకు విడిసి, ఎండిసి ల విజ్ఞప్తి
- విద్యా ప్రాంగణంలో రాజకీయ కార్యాలయం
- పిల్లలకు, మహిళలకు కలుగుతున్న ఇబ్బందులు
- అంగన్ వాడీ కేంద్రం ఎదుటే... రాజకీయాల అడ్డ
- మద్యం ప్రియులు, గంజాయి ప్రియులతో పొంచి ఉన్న

**జగిత్యాల:** జగిత్యాల జిల్లా లోని బుగ్గారం మండల కేంద్రంలో ఎలాంటి అనుమతులు లేకుండా, అక్రమంగా ఎమ్మార్సీ భవనాన్ని కబ్జా చేసుకొని కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఎంపిపి, ఎంపిడివో, ఎంపీవో కార్యాలయాన్ని తక్షణమే ఖాళీ చేయాలని బుగ్గారం మండల అభివృద్ధి కమిటి అధ్యక్షులు చుక్క గంగారెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటి అధ్యక్షులు నక్క చంద్రమౌళి లు స్థానిక తహశీల్దార్ కు, ఎంపిడివో కు విజ్ఞప్తి చేశారు. బుధవారం వారు స్వయంగా తహశీల్దార్ మాజీద్, ఎంపిడివో మాడిషెట్టి శ్రీనివాస్‌లను కలిసి విజ్ఞాపన పత్రాలు అందజేసి, వాస్తవ పరిస్థితులను వివరించారు. గతంలో అద్దె భవనంలో ఉన్న ఎంపిపి కార్యాలయాన్ని రాజకీయంగా ఎమ్మార్సీ భవనం పై కన్ను పడి కబ్జా చేసి అక్రమంగా ఆక్రమించుకున్నారని వారు ఆరోపించారు. ఉన్నతాధికారుల నుండి గానీ, ప్రభుత్వం ద్వారా గానీ ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమంగా కబ్జా చేసి ఎంఆర్ సి భవనంలో ఎంపిపి కార్యాలయాన్ని కొనసాగించడం ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులకు, నాయకులకు తగదన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో అంగన్ వాడీ కేంద్రానికి ఎదురుగా గల ఎమ్మార్సీ భవనంలో ఎంపిపి కార్యాలయం కొనసాగడం వలన రాజకీయ నాయకుల, కార్యకర్తల అడ్డాలు, ఇదే సాకుగా భావించి మద్యం ప్రియులు, గంజాయి ప్రియులు కూడా అక్కడే అడ్డాలు వేస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందని వారు వివరించారు. వీటి వలన పాఠశాలలోని ఆడ పిల్లలకు, మహిళా టీచర్లకు, ఆంగన్ వాడీ టీచర్లకు, పిల్లల తల్లులకు, అంగన్ వాడీ కేంద్రానికి వచ్చే గర్భిణీలకు, మహిళలకు అనేక ఇబ్బందులు కలుగుతున్నాయని వారు పేర్కొన్నారు. మద్యం ప్రియులు, గంజాయి ప్రియులు, ఆకతాయిలు, ప్రవర్తన సరిగా లేని కొందరు రాజకీయ నాయకుల వలన అనుకోని సంఘటనలు జరిగే ప్రమాదం కూడా పొంచి ఉందని వారు తహశీల్దార్ మాజిద్, ఎంపిడివో శ్రీనివాస్ లతో ఆవేదన వ్యక్తం చేశారు.

# కొండేపి నియోజకవర్గం నుంచి నలుగురు ఎమ్మెల్యేలు





**ఒంగోలు, జూన్ :** ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో టీడీపీ కూటమి అఖండ విజయం సాధించింది. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తూ తెలుగు రాజకీయాల్లో చరిత్ర సృష్టించారు. రాష్ట్రంలోని 175 స్థానాల్లో కూటమి 164 స్థానాల్లో గెలిస్తే.. ఒక్క టీడీపీనే 135 సెగ్మెంట్లు సొంతం చేసుకుంది. ఆ 135 మంది ఎమ్మెల్యేల్లో నలుగురు ఒకే నియోజకవర్గ వాసులవ్వడం విశేషం. ఆ నలుగురిలో ముగ్గురు వేర్వేరు నియోజకవర్గాల నుంచి గెలవగా.. ఒకరు అదే నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అయ్యారు. ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గానికి ఆ ఘనత దక్కింది .. 2009 ఎన్నికల ముందు వరకు కొండపి జనరల్ సెగ్మెంట్.. డీలిమిటేషన్‌లో అది ఎస్సీ రిజర్వుడు స్థానమైంది. ఇప్పుడు ఈ నియోజకవర్గానికి చెందిన నలుగురు టీడీపీ నుంచి ఎమ్మెల్యేలుగా ఘన విజయాన్ని అందుకున్నారు. విశాఖపట్నం జిల్లా భీమిలీ నుంచి గెలిచిన మాజీ మంత్రి, గంటా శ్రీనివాసరావు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్థనరావు, చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామిలు ఈ నియోజకవర్గానికి చెందినవారే . ఈ నలుగురిది కొండేపి నియోజకవర్గం కావడం విశేషం. గంటా శ్రీనివాసరావు సొంత ఊరు ప్రకాశం జిల్లా కొండేపి నియోజకవర్గంలోని జరుగుమల్లి మండలం చింతలపాలెం.. ఆయన విశాఖపట్నానికి వెళ్లి.. అక్కడే సెటిలయ్యారు. విశాఖపట్నంలో వ్యాపారాలు చేసిన గంటా శ్రీనివాసరావు.. ఆతర్వాత రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. 1999లో టీడీపీ నుంచి అనకాపల్లి నుంచి ఎంపీగా పోటీచేసి విజయం సాధించారు. గంటా 2004 ఎన్నికల్లో చోడవరం నుంచి టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా పోటీచేసి గెలిచారు. 2009 ఎన్నికలకు ముందు ప్రజారాజ్యం పార్టీలో చేరి అనకాపల్లి ఎమ్మెల్యేగా గెలుపొంది. పీఆర్పీని కాంగ్రెస్‌లో విలీనం చేయడంతో.. కిరణ్ కుమార్ రెడ్డి కేబినెట్‌లో తొలిసారి మంత్రి అయ్యారు. 2014 ఎన్నికలకు గంటా శ్రీనివాసరావు టీడీపీలో చేరి విశాఖపట్నం జిల్లా భీమిలి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి కేబినెట్‌లో బెర్త్ దక్కించుకున్నారు. 2019 ఎన్నికల్లో గంటా విశాఖ నార్త్ నుంచి పోటీచేసి విజయం సాధించారు. ఈ సారి మళ్లీ భీమిలీకి షిఫ్ట్ అయి 92,401 ఓట్ల మెజార్టీతో మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్‌ని చిత్తు చేసి.. తిరిగి మంత్రి వర్గం రేసులోకొచ్చారు. ప్రతిసారి సెగ్మెంట్ మారినా గెలుస్తూ వస్తున్న ఆయన లక్కీ లీడర్ బ్రాండ్ నిలపెట్టుకున్నారు. ఆయన రాజకీయ ప్రస్థానం గురించి కొండపిలో ఆయన బంధుగణం కథలుకథలుగా చెప్పుకుంటుంటారు. దామచర్ల జనార్ధనరావు సొంత గ్రామం ప్రకాశం జిల్లా కొండేపి నియోజకవర్గం టంగుటూరు మండలం తూర్పునాయుడు పాలెం.. జనార్థన్ తాత దామచర్ల ఆంజనేయులు టీడీపీలో సీనియర్ నేత.. మంత్రిగా కూడా పనిచేశారు. ఆంజనేయులు ఆయన 1994, 99లో కొండపి నుంచే విజయాలు సాధించారు. తాత రాజకీయ వారసుడిగా జనార్థన్ 2010లో టీడీపీ నుంచి రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. కొండేపి నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడు కావడంతో.. తెలుగు దేశం పార్టీ అధిష్టానం ఒంగోలు ఇంఛార్జ్ బాధ్యతల్ని అప్పగించింది. వైసీపీ ఎఫెక్ట్‌తో 2012లో ఒంగోలు ఉప ఎన్నిక జరిగింది. జనార్థన్ టీడీపీ నుంచి పోటీచేసి బాలినేని శ్రీనివాసరెడ్డి చేతిలో ఓడిపోయారు. మళ్లీ 2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి మాజీ మంత్రి బాలినేనిని ఓడించారు. 2019లో మరోసారి ఒంగోలు నుంచి పోటీచేసి ఓడిపోయారు. 2024 ఎన్నికల్లో ఒంగోలు నుంచి బరిలోకి దిగి. 34,026 ఓట్ల తేడాతో బాలినేనిపై విజయం సాధించారు. అలా ఆ కొండపి లీడర్ రెండోసారి అసెంబ్లీ మెట్లు ఎక్కబోతున్నారు. చీరాల నుంచి గెలిచిన మద్దలూరి మాలకొండయ్యది కూడా కొండిపి నియోజకవర్గమే. ఆయన తెలుగు దేశం పార్టీలో చేరి రాజకీయాల్లోకి వచ్చారు. 2009లో ఒంగోలు ఎంపీగా పోటీచేసి ఓడిపోయారు. ఆ తర్వాత ఆయన రాజకీయాలకు కొంతకాలం దూరంగా ఉన్నారు. మళ్లీ 2024 ఎన్నికలకు ముందు యాక్టివ్ అయ్యారు. మాలకొండయ్యకు టీడీపీ బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గ ఇంఛార్జ్‌గా నియమించింది. ఎన్నికల్లో చీరాల టీడీపీ టికెట్ కేటాయించగా వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్‌పై 20,894 ఓట్ల తేడాతో విజయం సాధించారు కొండయ్య. ఆయన మొదటిసారి అసెంబ్లీలో అడుగుపెట్టబోతున్నారు. డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి తెలుగుదేశం పార్టీ నుంచి రాజకీయాల్లోకి వచ్చారు. 2009 ఎన్నికల్లో తొలిసారి కొండపి నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున పోటీచేసి ఓడిపోయారు. 2014 ఎన్నికల్లో మరోసారి పోటీచేసిన ఆయన ఘన విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో సైతం వైసీపీని మట్టి కరిపించారు. ఈ సారి 24, 756 ఓట్ల మెజార్టీతో వైసీపీ అభ్యర్థి మాజీ మంత్రి, ఆదిమూలపు సురేష్‌పై ఘన విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టి ఎస్సీ కోటాలో మంత్రిగా ఫోకస్ అవుతున్నారు. ఆ నలుగురే కాదు.. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, కందుకూరు నుంచి వైసీపీ తరఫున పోటీచేసి ఓడిపోయిన కనిగిరి మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, కొండపి, కందుకూరు ఎమ్మెల్యేగా పనిచేసిన సీనియర్ నేత పోతుల రామారావు కూడా కొండిపి నియోజకవర్గానికి చెందినవారే కావడం విశేషం.

# చంద్రబాబు తిరుమల పర్యటనకు పటిష్టమైన భద్రత

**తిరుపతి:** బుధవారం ముఖ్యమంత్రి గా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత చంద్రబాబు నాయుడు తిరుమల కు వస్తున్న నేపథ్యంలో పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నారు. బుధవారం తిరుమలకు చేరుకుని గురువారం ఉదయం కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకోనున్నారు. ఈ నేపథ్యంలో ఈరోజు జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయం నుండి తిరుపతి మీదుగా ఘాట్ రోడ్లు, తిరుమల, గాయత్రి అతిథిగృహం, వైకుంఠంకాంప్లెక్స్, శ్రీవారి ఆలయం వరకు రోడ్డు మార్గాన తనిఖీలు చేపట్టారు. విమానాశ్రయం లోపల, విఐపి గేటు, పార్కింగ్ ప్రదేశం, గ్యాలరీలను, పరిశీలించి పోలీసు, ఎయిర్పోర్ట్ భద్రతా సిబ్బంది పాటించవలసిన బందోబస్తు ప్రణాళికను అధికారులకు వివరించారు. కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు నిర్దేశిత పార్కింగ్ ప్రదేశంలోనే వాహనాలను పార్కింగ్ చేపించి యాత్రికులకు ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రదేశాలలో జిల్లా ఎస్పీ క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేయాలని, ఇతర శాఖల అధికార యంత్రాంగాన్ని సమన్వయ పరుచుకుంటూ ముందుకు వెళ్లాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఈ



కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ నరసింహ రాజు ఐపీస్ గారు ,అదనపు ఎస్పీ వెంకట్రావు పరిపాలన, డిఎస్పీలు వెంకటాద్రి ఎస్బి, భవ్య కిషోర్ రేణిగుంట, రమణయ్య డిఎస్డబ్ల్యు, సిఐలు, ఆర్ఐలు, ఎయిర్పోర్ట్ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పోలీసుల దిగ్బంధంలో విజయవాడ



**విజయవాడ:** చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా బెజవాడ మొత్తం పోలీసుల అష్టదిగ్బంధనంలో ఉంది. వారధి, ప్రకాశం బ్యారేజ్ వైపు నుంచి విజయవాడలోకి పోలీసులు ఎవరినీ అనుమతించడం లేదు. వారధి వద్ద గుంటూరు వైపు భారీగా వాహనాలు నిలిచిపోయాయి. అదే విధంగా గుంటూరులోనే జాతీయ రహదారి పైకి వాహనాలను అనుమతించడం లేదు. విజయవాడ నగరంలో ఎక్కడికక్కడే బారికేడ్లను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. పాస్లు ఉన్న కార్లను కూడా ఆపుతున్నారని టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేసారు. కేసరపల్లి సభా స్థలి జాతీయ రహదారిపై ట్రాఫిక్ భారీగా స్తంభించింది. పోలీసులు చోద్యం చూస్తున్నారు. చివరకు విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని వాహనం సైతం ట్రాఫిక్ లో ఇరుక్కుపోయింది. సభా స్థలి వద్ద పరిస్థితి మరింత గందరగోళంగా ఉంది. పాస్లు ఉన్నా పోలీసులు పంపించడం లేదు. చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు

# మళ్లీ తెరుచుకున్న పూరీ ఆలయ మూడు ద్వారాలు



**భువనేశ్వర్:** ఒడిశా నూతన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ, ఆయన మంత్రివర్గ సహచరుల సమక్షంలో గురువారం ఉదయం పూరీలోని మహాప్రభు జగన్నాథ స్వామి ఆలయానికి చెందిన నాలుగు ద్వారాలు తెరుచుకున్నాయి. కొవిడ్ మహమ్మారి కాలంలో 12వ శతాబ్దానికి చెందిన ఈ ఆలయానికి చెందిన మూడు ద్వారాలు మూతపడగా గురువారం ఉదయం స్వామివారికి మంగళ హారతి పూర్తయిన తర్వాత అవి తెరుచుకున్నాయి. ముఖ్యమంత్రి, ఇద్దరు ఉపముఖ్యమంత్రులు, మంత్రులు, పలువురు బిజెపి ఎంపీలు, పార్టీ నాయకులు ఆలయాన్ని సందర్శించి స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆలయ సముదాయం చుట్టూ వారంతా ప్రదక్షిణ చేశారు. భువనేశ్వర్‌లో బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం బిజెపి ప్రభుత్వం జగన్నాథుని ఆలయం ద్వారాలన్నిటినీ తెరవాలని తొలి నిర్ణయం తీసుకుంది. స్వామివారికి మంగళ హారతి తర్వాత ఉదయం 6.30 గంటలకు ఆలయానికి చెందిన నాలుగు ద్వారాలను మళ్లీ తెరిచినట్లు పూరీలో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి మాఝీ తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పూరీ జగన్నాథుని ఆలయం అభివృద్ధి, మెరుగైన నిర్వహణ, అదనపు సౌకర్యాల కోసం రూ. 500 కోట్ల మూల నిధిని ఏర్పాటు చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించినట్లు మాఝీ తెలిపారు. రానున్న రాష్ట్ర బడ్జెట్‌లో ఇందుకు సంబంధించిన కేటాయింపులు చేస్తామని ఆయన తెలిపారు. కొవిడ్ మహమ్మారి తర్వాత కూడా ఆలయానికి చెందిన మూడు ద్వారాలను ఎదుకు తెరవలేదో వివరణ కోరుతూ ఒక నివేదికను సమర్పించాలని ఆలయ అధికారులను కోరామని రాష్ట్ర మంత్రి సురేష్ పూజారి తెలిపారు. ఆలయానికి చెందిన అన్ని ద్వారాలను తెరవడం బిజెపి ఎన్నికల మేనిఫెస్టోలో ప్రధాన వాగ్దానాలలో ఒకటి. గత బిజెడి ప్రభుత్వం మూడు ద్వారాలను మూసివేసి కేవలం సింహద్వారం నుంచి మాత్రమే భక్తులను ఆలయంలోకి అనుమతించింది.

## హరీశ్ రావుకు కాళేశ్వరం కమిషన్

# నోటీసులు అందొచ్చు!



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్ట్ లో బ్యారేజీల నిర్మాణంపై విచారణ ఊపందుకుంది. ఏజెన్సీలను అఫిడవిట్ ఫైల్ చేయమని కాళేశ్వరం కమిషన్ చైర్మన్ ప్రధాన న్యాయమూర్తి చంద్ర ఘోష్ స్పష్టం చేశారు. ఆ అఫిడవిట్లపై విచారణ కొనసాగగలదని వివరించారు. టెక్నికల్ అంశాలు సిద్ధమైన తర్వాత ప్రజా ప్రతినిధులకు నోటీసులు ఇస్తామన్నారు. ఆ తర్వాత భారీ నీటి పారుదల శాఖా మంత్రి, ముఖ్యమంత్రిని విచారణకు పిలుస్తామని పేర్కొన్నారు. జులై రెండో వారం లేకుంటే ఆ తర్వాత విచారణకు పిలుస్తామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నీటిపారుదల శాఖ మంత్రి అయిన హరీశ్ రావుకు త్వరలో నోటీసులు అందే అవకాశం ఉంది. ఆ తర్వాత మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావుకు నోటీసులు ఇవ్వొచ్చని తెలుస్తోంది.

## విమానయాన ఛార్జీలు తగ్గిస్తాం: రామ్ మోహన్ నాయుడు



న్యూఢిల్లీ: కింజారపు రామ్ మోహన్ నాయుడు గురువారం కేంద్ర విమానయాన శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. సాధారణ వ్యక్తులకు కూడా అందుబాటులో ధరలు ఉండేలా విమాన ఛార్జీలు తగ్గించనున్నట్లు ఆయన చూచాయగా తెలిపారు. ప్రతి ఒక్కరు విమానయానం చేసేలా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని ఆయన అన్నారు. అయితే విమాన ఛార్జీలు చౌకగా మారినప్పుడే సామాన్యులు సైతం విమానయానం చేయడానికి వీలవుతుందన్నారు. " నన్ను విమానయాన శాఖ మంత్రిగా ప్రకటించాక, నేను ఎక్కడికి వెళ్లినా ప్రజలు విమాన ఛార్జీలు ఎక్కువ ఉన్నట్లు, గత కొన్ని సంవత్సరాలలో పెరిగినట్లు... ముఖ్యంగా కోవిడ్ తర్వాత బాగా పెరిగినట్లు తెలిపారు. ఈ విషయాన్ని నేనింకా పూర్తిగా అర్థం చేసుకోవాల్సి ఉంది. స్టేక్ హోల్డర్లతో కూర్చుని నేను దీని మీద చర్చిస్తాను" అని రామ్ మోహన్ నాయుడు ఓ వార్తా సంస్థకు తెలిపారు. ఆయన ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం నుంచి మూడో సారి లోక్ సభకు ఎన్నికయ్యారు. ఆయన వయస్సు 36 ఏళ్లు.

# తెలంగాణలో గొర్రెల కుంభకోణం

హైదరాబాద్: తెలంగాణలో గొర్రెల పంపిణీ పథకంలో అక్రమాలు జరిగినట్లు ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్(ఈడి) గుర్తించింది. ఈ క్రమంలో అక్రమాలపై ఈడి ఫోకస్ పెట్టింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం(పిఎంఎల్‌ఏ) కింద విచారణ చేపట్టనున్నట్లు తెలంగాణ పశుసంవర్ధక శాఖకు ఈడి నోటీసులు ఇచ్చింది. ఈ పథకానికి సంబంధించిన పూర్తి సమాచారం ఇవ్వాలని ఈడి అధికారులను ఆదేశించింది. తెలంగాణలో గొర్రెల కొనుగోలులో రూ. 700 కోట్ల స్కామ్ జరిగినట్లు ఏసిబి ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఈ గొర్రెల కొనుగోలు వ్యవహారంపై ఈడి దృష్టి సారించింది. మనీలాండరింగ్ కోణంలో ఈడి దర్యాప్తు చేయనున్నది. జిల్లాలవారీగా లబ్ధిదారుల పేర్లు, వారి చిరునామా, ఫోన్ నంబర్లు, బ్యాంకు ఖాతల వివరాలు వంటి సమాచారం ఇవ్వాలని ఈడి కోరనున్నది. అదే క్రమంలో గొర్రెల రవాణా ఏజెన్సీల సమాచారం, చెల్లింపు వివరాలు, గొర్రెల దాణా, దానిని ఎయే లబ్ధిదారులకు ఇచ్చారు అనే వివరాలు సేకరించనున్నారు. ఇంకా దీని కోసం ఎవరికి నిధులు ఇచ్చారనే అంశాన్ని కూడా ఈడి వివరాలు కోరనున్నది. గొర్రెల పంపిణీ పథకం కుంభకోణం నిందితుల విచారణ ముగిశాక వారిని ఏసిబి అధికారులు చంచల్ గూడ జైలుకు పంపించారు. ఏసిబి అధికారులకు వీరు సరైన సమాధానం ఇవ్వలేదని సమాచారం. ఇప్పటి వరకు 10 మందిని అరెస్టు చేశారు. ఇదిలావుండగా దర్యాప్తులో



భాగంగా ప్రస్తుతం జైలులో ఉన్న పశుసంవర్ధక శాఖ సిఈవో రామ్ చందర్ నాయక్, మాజీ ఓఎస్ డి కళ్యాణ్ కుమార్ లను ఏసిబి అధికారులు కోర్టు అనుమతితో అదుపులోకి తీసుకున్నారు. మూడు రోజుల పాటు వీరిని విచారించేందుకు కోర్టు అనుమతినిచ్చింది.

## రాజ్యసభ ఎన్నికకు సునేత్ర పవార్ నామినేషన్



న్యూఢిల్లీ: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ భార్య సునేత్ర పవార్ గురువారం ఎన్‌సిపి అభ్యర్థిగా రాజ్యసభ ఎన్నికల కోసం నామినేషన్ దాఖలు చేశారు. రాజ్యసభ ఎన్నికలలో పోటీ చేయడం పట్ల తనకు ఆసక్తి ఉన్నప్పటికీ సునేత్ర పవార్ నామినేషన్ పట్ల తాను అసంతృప్తిగా లేనని ఎన్‌సిపి సీనియర్ నాయకుడు, రాష్ట్ర మంత్రి ఛగన్ భుజ్‌బల్ అన్నారు. సునేత్ర పవార్ ఎంపిక సమిష్టి నిర్ణయమని ఆయన వ్యాఖ్యానించారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికలలో మహారాష్ట్రలోని బారామతి నియోజవకవర్గం నుంచి ఎన్‌సిపి అభ్యర్థిగా పోటీ చేసిన సునేత్ర పవార్ తన మరదలు, ఎన్‌సిపి(శరద్ పవార్) అధినేత శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలె చేతిలో ఓటమి చెందారు. రాజ్యసభ ఎన్నికలలో సునేత్ర పవార్‌ను నిలపాలని పార్టీ నిర్ణయించిందని, తాను కూడా పోటీ చేయడం పట్ల ఆసక్తిగా ఉన్నానని, కాని బుధవారం సాయంత్రం జరిగిన సమావేశంలో పార్టీ నాయకులు ఆమె పేరును ఖరారు చేశారని ఛగన్ భుజ్‌బల్ విలేకరులకు తెలిపారు. 10 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలను రాజ్యసభ సచివాలయం ఇటీవలే ప్రకటించింది. వీటిలో అస్సాం, బీహార్, మహారాష్ట్రలో రెండేసి, హర్యానా, మధ్యప్రదేశ్, రాజస్థాన్, త్రిపురలో ఒకటి చొప్పున ఉన్నాయి. కీలక పదవులన్నీ ఒకే కుటుంబానికి వెళుతున్నాయా అని విలేకరులు ప్రశ్నించగా సునేత్ర పేరును అజిత్ పవార్ నిర్ణయించలేదని భుజ్‌బల్ తెలిపారు. మహారాష్ట్ర నుంచి లోక్‌సభ సభ్యులుగా పియూష్ గోయల్, ఉదయన్‌రాజె భోంస్తే ఎన్నికవ్వడంతో రాజ్యసభలో రెండు ఖాళీలు ఏర్పడ్డాయి.

## అరుణాచల్ ముఖ్యమంత్రిగా మూడో సారి పెమా ఖండూ ప్రమాణ స్వీకారం

ఇటానగర్: అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రిగా పెమా ఖండూ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. ఆయన ముఖ్యమంత్రిగా కొనసాగడం వరుసగా ఇది మూడోసారి. ఆయనతో పాటు ఉపముఖ్యమంత్రిగా బిజెపికి చెందిన చౌనా మే కూడా ప్రమాణస్వీకారం చేశారు. అరుణాచల్ ప్రదేశ్ కెటి పర్నాయక్ వారితో ప్రమాణస్వీకారం చేయించారు. పెమా ఖండూతో పాటు మరో 11 మంది మంత్రులు ప్రమాణస్వీకారం చేశారు. ప్రమాణస్వీకారం చేసిన వారిలో ఖండూ సహా మరో పది మంది క్యాబినెట్ మంత్రులు %-% బియురామ్ వాహ్గే, న్యాటో దుకామ్, గాబ్రియేల్ డెన్వాంగ్ వాంగ్సు, వాంగ్కి లోవాంగ్, పసాంగ్ దోర్జీ సోనా, మామా నటుంగ్, దాసంగ్లు పుల్, బలో రాజా, కెంటో జిని మరియు ఓజింగ్ టేసింగ్ ఉన్నారు. ఈ ప్రమాణస్వీకారోత్సవానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జెపి.నడ్డా, కిరణ్ రిజిజు, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, తదితర ప్రముఖులు హాజరయ్యారు.



# ఇక పై 4.0 పాలన... చంద్రబాబు

**తిరుమల:** రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో ఒక చారిత్రాత్మక తీర్పును ప్రజలు తమకు ఇచ్చారన్నారు. నిన్న ప్రమాణస్వీకారోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు దేశంలోని ప్రముఖులు హాజరవ్వడం చాల సంతోషంగా ఉందన్నారు. తిరుమల శ్రీవారి దర్శనం తరువాత ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు మీడియా సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం తరువాత చేపట్టిన తొలి ప్రెస్ మీట్ ఇది. ఈ సందర్భంగా అనేక విషయాలను పంచుకున్నారు. తిరుమల వేంకటేశ్వర స్వామి తన కులదైవమని చెప్పారు. తాను ఏ పని సంకల్పించినా ఒక్క నిమిషం ఆ స్వామిని తలుచుకునే కార్యక్రమం చేపడతానన్నారు. తాను చదువుకునే రోజుల్లో తిరుమలకు నడుచుకుంటూ వచ్చేవాళ్లమని పాత రోజులు గుర్తు చేశారు. వెంకటేశ్వరస్వామి ఆశీసులతో అంచెలంచెలుగా ఎదిగానన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా పట్టువస్త్రాలు సమర్పిచేందుకు తిరుమల చేరుకునే సమయంలో ఘాట్ రోడ్డులో బాంబుదాడులు జరిగిన అంశాన్ని ప్రస్తావించారు. ఆ ఘటనలో తనను వెంకటేశ్వరస్వామి బ్రతికించారని కీర్తించారు. ఈ రాష్ట్రానికి, ఈ జాతికి మరింత సేవ చేయాల్సి ఉందని తనను ప్రాణాలతో బ్రతికించారని విశ్వసిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నదే తన లక్ష్యం అన్నారు. భారతదేశంలో ఆంధ్రరాష్ట్రం అత్యున్నత స్థానంలో ఉండాలన్నదే తన ధ్యేయమన్నారు. రాష్ట్రంలో సంపద సృష్టించడం ఎంత ముఖ్యమో.. సృష్టించిన సంపద ప్రతి పేదవాడికి చేరవేయాలన్న సంకల్పంతో ముందుకు వెళ్తానన్నారు. పేదరికం లేని దేశం తద్వారా పేదరికం లేని రాష్ట్రాన్ని తీసుకురావాలన్న స్పూర్తితో పనిచేస్తానన్నారు. ఉదయాన్ని లేచిన వెంటనే వెంకటేశ్వరస్వామిని ఈ అంశాలపై ధ్యానం చేస్తానని వివరించారు. తిరుమలకు వస్తే వైకుంఠానికి వచ్చిన అనుభూతి కలుగుతుందని.. ఇక్కడ ఓం నమో నారాయణాయ మంత్రం తప్ప ఇంకేమీ వినిపించకూడదన్నారు. పవిత్రమైన తిరుమలను అపవిత్రం చేయడం సరికాదన్నారు. గత ఐదేళ్లలో తిరుమలను అధ్వాన్నంగా మార్చారని విమర్శించారు. వెంకటేశ్వర స్వామిని ఊరూరు తిప్పుతూ.. పెళ్లి, పేరంటాలకు తీసుకెళ్లారన్నారు. ఇకపై తిరుమల నుంచే ప్రక్షాళన ప్రారంభిస్తామని పేర్కొన్నారు. తిరుమల కొండపై నాన్ వెజ్ తీసుకొచ్చారని ఆరోపించారు. నేటి నుంచి ప్రజాపాలన మొదలైందని చెప్పారు. ఇకపై 4.0 పాలన ఎలా ఉండబోతుందో మీరే చూస్తారు అంటూ సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు.

## 700 కోట్ల గొర్రెల స్కామ్....

# దృష్టి పెట్టిన ఈడీ

**హైదరాబాద్:** తెలంగాణలో ప్రభుత్వం మారిన తర్వాత బయటపడిన గొర్రెల పంపిణీ స్కీమ్‌లో అక్రమ నగదు రవాణా జరిగిందని గుర్తించిన ఈడీ అధికారులు పూర్తి వివరాలు కావాలని తెలంగాణ సీఐడీ అధికారులకు లేఖ రాశారు. గొర్రెల స్కామ్ లో జరిగిన 700 కోట్ల అవినీతి జరిగిందని పెద్ద మొత్తం లో డబ్బు చేతులు మారినట్టు ఆధారాలను తెలంగాణ ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ కేసులో ఏసీబీ నమోదు చేసిన వివరాలు ఆదారంగా ఈడీ పి ఏం ఎల్ ఏ యాక్ట్.. కింద గొర్రెల స్కామ్ పై విచారణ చేపట్టాలని నిర్ణయించింది. గొర్రెల స్కీమ్ కు సంబంధించిన పూర్తి వివరాలు అందివ్వాలని పశు సంవర్ధక శాఖ అధికారులకు ఈడీ లేఖరాసింది. రాష్ట్ర వ్యాప్తంగా గొర్రెల పంపిణీ పథకం లబ్ది దారుల వివరాలు, గొర్రెల కొనుగోలు కోసం ఏయే జిల్లాల్లో ఏ అధికారుల బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ అయింది.. ఎంత జమ చేశారు వంటి వివరాలను చెప్పాలని ఆదేశించింది. గొర్రెల రవాణాలో కాంట్రాక్టు కుదుర్చుకున్న ఏజెన్సీల వివరాలు ఈ కుంభ కోణానికి కారకులు ఎవరు.. ఎవరెవరి పాత్ర ఉంది.. రికార్డ్స్ లో తప్పుడు లెక్కలు వంటి వాటి వివరాలు కూడా కోరింది. రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ మాజీ సీఈవో, గొర్రెలు మేకల అభివృద్ధి సహకార సంస్థ మాజీ ఎండీ రాంచందర్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఓఎస్డీ కల్యాణ్ కుమార్ లను ఇప్పటికే అరెస్టు చేశారు. వీరు ఈ కుంభ కోణానికి కారకులు ఎవరు.. ఎవరెవరి పాత్ర ఉంది.. రికార్డ్స్ లో తప్పుడు లెక్కలపై వారి నుంచి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. గొర్రెలు అమ్మిన రైతుల ఖాతాలకు కాకుండా ఇతర బినామీల ఖాతాలకు డబ్బు మళ్ళింపుపై వివరాలుసేకరిస్తున్నారు. మనీలాండరింగ్ జరిగిందని ఈడీకి ఈ కేసులో ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. స్వచ్ఛందగా తెలంగాణ ఏసీబీ పోలీసులు నమోదు చేసిన కేసులో ఈడీ వివరాలు అడిగిందంటేనే ఓ సంకేతం స్పష్టంగా కనిపిస్తోందని రాజకీయవర్గాలంటున్నాయి. తలసాని శ్రీనివాస్ యాదవ్ స్కాం జరిగినప్పుడు సంబంధిత మంత్రిగా ఉన్నారు. కేసు ఆయ నదగ్గరకే వెళ్తుందన్న చర్చ జరుగుతోంది. అరెస్టు అయిన ముగ్గురు వెల్లడించిన అంశాలతో త్వరలో మరికొందర్ని అరెస్టు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## కూరగాయుల ధరలకు రెక్కలు.. మళ్లీ మోత మోగుతున్న టమాటా, ఉల్లి ధరలు..!

హైదరాబాద్ : కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి. అరకొర సంపాదనతో బతుకు బండి లాగుతున్న సామాన్యులు కూరగాయలు కొనలేని పరిస్థితి ఏర్పడింది. హైదరాబాద్ నగరంలో టమాటా, ఉల్లి ధరలు మళ్లీ ఆకాశాన్నంటాయి. వంటకు ప్రధానమైన టమాటా, ఉల్లి ధరలు పెరగడంతో.. గృహిణులు ఆందోళనకు గురవుతున్నారు. గత నాలుగైదు రోజుల నుంచి ఉల్లి ధరలు భారీగా పెరిగాయి. టమాటా ఉన్నట్టుండి నిన్నటి నుంచి భారీ ధర పలుకుతోంది. నాణ్యమైన మొదటి రకం టమాటా కిలో రూ. 80 నుంచి రూ. 90 పలుకుతోంది. సెకండ్ క్వాలిటీ టమాటా కిలో ధర రూ. 60 నుంచి 70 ఉంది. ఇక హెూల్ సేల్ మార్కెట్లలో రూ. 120కి మూడు కిలోల టమామా విక్రయిస్తున్నారు.



Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com